"నమస్కారం, డాక్టరుగారూ! నేను గుర్తున్నానండీ?" అని గది గుమ్మంలో నవ్వుతూ నిలబడ్డాడు రాజారావు. అతని వెనక ఒక అమ్మాయికూడా ఉంది బిడియపడుతూ.

డాక్టర్ రఘునాథ్ అతన్ని చూసి— "భలేవాడివోయ్, గుర్తు లేకపోవటం ఏమిటి?" అంటూ చేతిలో పుస్తకం టీపాయ్‌మీద పెట్టి రాజారావు వెనక నిలబడ్డ అమ్మాయిని ప్రత్యేక శ్రద్ధతో— "కూర్చోండి" అని మర్యాద చేశాడు.

ఆ అమ్మాయి చాలా సిగ్గుపడుతూ పెద్ద సోఫాలో ఒక చివర ఒదిగి కూర్చుంది. రాజారావు ఆమెకి చాలా దగ్గిరగా కూచుని— "నాకు పెళ్ళయింది, డాక్టర్!" అన్నాడు.

"తెలుస్తూనే ఉంది. నీ పెళ్ళికి పిలవకుండా నువ్వే నన్ను మరిచిపోయి పైగా. . ."

"ఎక్స్‌క్యూజ్ మీ, డాక్టర్! ఎవర్నీ పిలవటానికి వీలుకాలేదు. అసలు శుభలేఖలన్నా వేయించే టైమ్ లేదు. గభాల్న కుదిరింది సంబంధం."

"గభాల్నా?" అని ఫక్కున నవ్వాడు రఘునాథ్.

రాజారావు నవ్వుతూ తన పెళ్ళి గుఱించి ఎంత సింపుల్‌గా అయిపోయిందో, పెళ్ళికి పిలవనందుకు చుట్టాలకందరికీ ఎంతెంత కోపాలొచ్చాయో, తన స్నేహితులుకూడా నిష్ఠూరాలేస్తూ ఎలాంటి ఉత్తరాలు రాశారో, అందరికీ తను ఎలా సంజాయిషీ లిచ్చుకున్నాడో తెగ వర్ణించాడు. నిమిషనిమిషానికీ ఆమె వేపు చూస్తూ నవ్వుతూ మాట్లాడాడు. మాటల మధ్య ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆమె విడిపించుకోవాలని సున్నితంగా ప్రయత్నించి ఊరుకుంది. అదేమీ అతను గ్రహించలేదు. ఆమె వేళ్ళ స్పర్శని ఏకాంతంగా ఉన్నంత పరవశంగా అనుభవించాడు. తను అట్లా ప్రవర్తిస్తూన్న జ్ఞానం అతనికున్నట్టు లేదు. నవ్వుతూ మాట్లాడుతూ, ఆమెని చూసి ముగ్ధుడౌతూ కనిపించాడు. ఆ అమ్మాయి తన భార్య అయినందుకు అతను ఎంత ఎక్కువ ఆనందిస్తున్నాడో రఘునాథ్‌కి స్పష్టంగా తెలిసింది.

ఆమె పేరు శ్యామల. ఎక్కువ చదువుకోలేదు. పల్లెటూళ్ళో పుట్టి పెరిగింది. పేదకుటుంబం. మేనమామే బాధ్యత తీసుకుని ఆమె పెళ్ళి చేశాడు.

"అలాగే! రేపు క్లినిక్‌కి వస్తే చూస్తాను" అని లేచాడు రఘునాథ్.

శ్యామల నిలబడి— "నమస్కారం!" అంది నెమ్మదిగా. చేతులు జోడించింది. కళ్ళెత్తలేదు. అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోయింది— బయటికి.

"రేపు రమ్మంటారా? ఉదయమేనా? వెళతాను, డాక్టర్!" అని రాజారావు గబగబా వెళ్ళి ఆమె చెయ్యి అందుకున్నాడు. ఇద్దరూ అంత దగ్గిరగా నడిచి వెళుతూంటే ఎంతో అందంగా ఉన్నారు.

'కానీ, ఆ అమ్మాయికి రాజారావుని చేసుకోవటం బాగా ఇష్టం లేదేమో. లేనట్టే ఉంది. మనసు సరిపెట్టుకోవాలని చాలా ప్రయత్నం చేస్తూన్నట్టుంది. ఏమో! తెలీని విషయం గురించి ఆలోచించకూడదు' అనుకుని రఘునాథ్ టీపాయ్‌మీద పుస్తకం తీసి ఆవరణలో సర్వి గ్రౌండ్‌లో బంతి ఆడుకుంటూన్న పిల్లల దగ్గిరకి వెళ్ళాడు.

ఆ రాత్రి రఘునాథ్ భోజనాల దగ్గిర భార్యతో కాలక్షేపం కబుర్లు మాట్లాడుతూ రాజారావు సంగతి చెప్పి— "గభాల్న కుదిరిందట సంబంధం. అతను నా

# సరికొత్త మనుషులు

ముప్పాళ రంగనాయకమ్మ

"కట్నం బాగా తీసుకుని అంత గభాల్న ఒప్పేసుకున్నావేమో! అవునా?"

"అదేం కాదు, డాక్టర్! కావాలంటే పెళ్ళికూతుర్నే అడగండి" అంటూ రాజారావు భార్యని చూసి— "పిల్ల నాయనమ్మ నడుంనొప్పితో రెండ్రోజులు మంచం ఎక్కి పిల్ల పెళ్ళి అర్జంటుగా చూడాలని గోల పెట్టిందట. వారం రోజుల్లో లగ్నం పెట్టేశారు. అది తప్పితే దగ్గిర్లో ముహూర్తాలేం లేవని కంగారు పెట్టేశారు. ఈ అందకత్తెని చూసి వాళ్ళ షరతులన్నీ ఒప్పేసుకున్నాను" అని చిలిపిగా చూశాడామెని. ఆ అమ్మాయి సిగ్గుపడి తల వంచేసుకుంది.

అత నన్న మాటలలో అతిశయం ఏమీ లేదు. ఆమె అందమైందే. ఆ అర్థంలేని సిగ్గూ, మాటిమాటికీ ముడుచుకోవటం ఆ అందాన్ని కొంత పాడు చేస్తున్నాయి గానీ, లేకపోతే ఇంకా ఆకర్షణీయంగా కనపడేది.

డాక్టర్‌కి వినటానికి ఆసక్తిలేని కబుర్లుకూడా చాలా చెప్పాడు రాజారావు. "చాలా సిగ్గండీ! నోరు విప్పదు" అని ఫిర్యాదు చేశాడు.

"మీరు నమ్మరుగానీ ఈ పది రోజుల్లో పది మాటలుకూడా మాట్లాడలేదు. ముత్యాలు రాలతాయేమో" అని వేళాకోళం చేశాడు.

ఆ అమ్మాయి పెదిమలన్నా కదలనట్టు నవ్వి సిగ్గుపడి తల తిప్పుకుంది.

"ఫర్వాలేదు లేవోయ్! ఇద్దరి బదులూ నువ్వే మాట్లాడతావుగా?" అన్నాడు రఘునాథ్.

"అన్యాయం, డాక్టర్! మీరుకూడా అలాగే అంటే ఇక పలుకే బంగారమౌతుంది."


అతని ధోరణి రఘునాథ్‌కి ఒక్క క్షణం విసుగనిపించింది. ఆ ఆనందం పాడు చెయ్యలేక అతని మాటలన్నీ వింటూ కూర్చున్నాడు. చివరికి రాజారావు చెప్పింది— ఆమెకి ఒంట్లో బాగాలేదు. ఒక్కసారి డాక్టర్‌కి చూపించాలని తీసుకొచ్చాడు. అదీ విషయం.

మాట అనగానే భలే నవ్వొచ్చింది నాకు. ఆ లగ్నం తప్పితే దగ్గిర్లో లగ్నాలు లేవట. ఉత్త చాదస్తాల్లా ఉన్నాడు. ఆ అమ్మాయికి ఒకటే సిగ్గు. ఇద్దరికీ సరిపోయింది" అని నిసుక్కున్నాడు.

"సాయంత్రం వచ్చినవాళ్ళేనా? నేను సరిగ్గా చూడలేదు గానీ, ఆ అమ్మాయి బావున్నట్టుంది కదూ?" అంది అతని భార్య సుజాత.


"ఎంత బావుంటే మాత్రం ఇద్దరికీ ఏమీ పరిచయం లేకుండా, ఒకరేమిటో ఒకరికి బొత్తిగా తెలియకుండా, ప్రేమలాంటి దేకోశానా కలగకుండా ఉత్త శరీరాల అందం చూసి ఎలా నిర్ణయించుకుంటారో జీవితాలు అర్థం కాదు నాకు. మూర్ఖత్వం కదూ?"

సుజాత నవ్వి, "నీకు అర్థంకాని నిర్ణయాలు చేసుకున్న వాళ్ళంతా మూర్ఖు లనుకోవటం నీ మూర్ఖత్వం. ఎవరి అభిప్రాయాలు వాళ్ళకి సక్కగానే ఉంటాయి. స్వభావాలు మంచివైతే చాలదా సుఖంగా బ్రతకటానికి?" అంది.




రఘునాథ్ ఆశ్చర్యపడి— "నువ్వనాల్సిన మాటేనా ఇది? స్వభావాలు మంచివైన ఇద్దరు స్త్రీపురుషుల మధ్య ప్రేమానుభవంకూడా ఉండకూడదా? అప్పుడు పెళ్లి చేసుకుంటే జీవితాలెంత హాయిగా ఉంటాయో తెలీనట్టు మాట్లాడతావేం? నిజం, సుజా! ప్రేమ అనేది ఎప్పుడు కలిగనీ, ఇద్దరి మధ్యా ఆ అనుబంధం ఉండి తీరాలి. అది ఒక్కటే ఇద్దర్నీ దగ్గిర చేస్తుంది. జీవితంలో ఎలాంటి కష్టాలైనా, సమస్యలైనా ఎదుర్కొనే శక్తి వస్తుంది" అన్నాడు. అతని మాటలు ఎప్పటిలాగే నిర్మలంగా ఉన్నాయి. అతని చూపులనిండా జీవితంలో ఎంతో తృప్తి పొందిన ప్రశాంతత. చిరునవ్వుతో సుజాతని చూశాడు.

ఆమె భర్తని ప్రేమపూరితంగా చూస్తూ "అవును. కొన్ని కొన్ని దివ్యానుభవాలు అందరికీ దొరికేవి కావు" అంది. అతనితో స్నేహం కలిసిన రోజులన్నీ







గుర్తొచ్చి నవ్వుతూ— "రఘూ! ఆ రోజుల్లో మనం ఉత్త పిచ్చివాళ్లలాగ ప్రవర్తించే వాళ్లం గదా? మొన్న నువ్వు రాసిన ఉత్తరాలన్నీ చదివితే ఇప్పటికీ ఎంతో కొత్తగా ఉన్నాయి నాకు. అప్పుడప్పుడూ అలాంటి ఉత్తరాలు రాయకూడదా?" అని ఆశగా చూసింది.

"అప్పటిలాగ ఏడిపించకుండా జవాబు లిస్తావా మరి?"

"ఏం? నేను జవాబు లివ్వనప్పుడు నువ్వు రాయలేదా?" అని నవ్వి— "రోజూ ఓ ఉత్తరం రాసి ఇవ్వాలని పెళ్లికిముందే షరతు పెట్టాల్సింది నేను" అంది కోపంగా.

"షరతే పెడితే ఏం చేస్తాను మరి? మందుల చీటీ పుస్తకాలన్నీ నీ కోసం ఖర్చు చేసేవాణ్ణి" అని నవ్వి— "తొందరగా లే. సుజా! ఓ సారి మన ఉత్తరాలన్నీ చదువుకుందాం" అంటూ ఉత్సాహంగా భోజనంలో పడ్డాడు రఘునాథ్.

• • •

మర్నాడు రాజారావు శ్యామలని డాక్టర్ రఘునాథ్ నర్సింగ్‌హోమ్‌కి తీసుకొచ్చాడు. "మీకు ఒంట్లో ఏం బాగాలేదు? మీ అనారోగ్యం ఏమిటి?" అని డాక్టర్ శ్యామలని ప్రశ్నలు వేశాడు. ఆ అమ్మాయి నోరు విప్పలేదు. ఒక్కసారి కళ్లెత్తి అయోమయంగా చూపు చూసింది. మళ్లీ తల వంచుకొని మెదలకుండా కూర్చుంది.

"తలనొప్పండీ! నీరసం అండీ! ఆకల్లేదండీ!" అని రాజారావు ఉత్సాహంగా భార్య అనారోగ్యాన్ని వర్ణించబోయాడు.

డాక్టర్ అతని వర్ణన పెడచెవిని పెట్టి— "మువ్వు బయటికి వెళ్లి కూర్చోవోయ్! ఆమే చెపుతుందిలే. అన్నీ కనుక్కుంటాను" అని వాగ్దానం చేసి అతన్ని బయటికి పంపించివేశాడు.

"ఏం ఫర్వాలేదు. ఇప్పుడు చెప్పండి. అసలు మీకు ఒంట్లో బాధ ఏమిటి? డాక్టర్ దగ్గిర సిగ్గు పడకూడదు" అని శ్యామలను మృదువుగా అడుగుతూ దగ్గిరకి వచ్చి నిలబడ్డాడు.

ఆ అమ్మాయి లేచి నిలబడి తల వంచుకుంది. మాట్లాడలేదు.

డాక్టర్ నాడి పరీక్షకు ఆమె చెయ్యి అందుకోబోయాడు. అందనివ్వకుండా చటుక్కున చెయ్యి లాక్కుని రెండడుగులు వెనక్కి వేసింది. డాక్టర్ తెల్లబోయి తేరుకునేంతలో శ్యామల గోడవేపు మొహం తిప్పుకుని ఏడవటం మొదలుపెట్టింది. డాక్టర్ అర్థంగాక ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డాడు. ఆమె ఏడుస్తూ చేతులు జోడించి నమస్కారం చేస్తూ —"డాక్టరుగారూ! మీకు దణ్ణం పెడతాను. నన్ను రక్షించండి. నా జీవితమంతా మీ చేతుల్లో ఉంది. నా కేదన్నా మందు ఇవ్వండి. . . మీరు తప్ప నా కిప్పు డెవరూ దిక్కు లేరు. డాక్టరుగారూ! నన్ను రక్షించండి" అని సాధ్యమైనంత నిశ్శబ్దంగా ఏడవటానికి ప్రయత్నించింది.

డాక్టర్ తన అనుభవంతో విషయం గ్రహించగలిగాడు. నిర్ఘాంతపోయాడు. ఆమె నిశ్శబ్దంగా ఏడుస్తూనే ఉంది.

కొంతసేపటికి డాక్టర్ ఆమె చెయ్యి పట్టుకు చూశాడు. సందేహంగానే ఉంది.

"ఎన్నో నెల?" ఓదార్పుగా అడిగాడు.

"నా. . . లు. . . గు." భయపడుతూ చెప్పింది.

"ఇలాంటి పరిస్థితిలో ఏం చేద్దామని పెళ్లి చేసుకున్నట్టు?" చికాకు పడుతూ అడిగాడు. తల వంచుకుని ఏడ్చింది. జవాబు లేదు.

"అసలిది ఎట్లా జరిగింది?" అందా మనుకున్నాడు. ఊరుకున్నాడు. ఎట్లా జరిగిందో తనకి అనవసరం. జరిగింది. అంతే.

"రాజారావుకి తెలిస్తే ఏమౌతుంది?"

అదిరిపడింది. మళ్లీ చేతులెత్తి భగవంతుడికి నమస్కరిస్తున్నట్టు నమస్కారం చేసింది.

"వద్దు, డాక్టరుగారూ! ఆయనకి చెప్పకండి. నేనాయన మొహం చూడలేను. మీ రే విషమైనా ఇచ్చెయ్యండి. తాగుతాను. అంతేగాని ఆయనకి చెప్ప కండి."

డాక్టర్ కొంత అసహనంతో— "ధైర్యంగా ఉండాలి మీరు. ఇంత భయపడితే ఎట్లా? ఇప్పటికే మీరు పెద్ద పొరపాటు చేశారు. ఇంకా ఇద్దరి మధ్య ఇలాంటి రహస్యం దాచుకోటం ఎందుకు? మీకేం భయం లేదు. అతనితో నేను మాట్లాడతాను."

శ్యామల వెర్రిచూపు చూస్తూ— "వద్దు. వద్దు డాక్టరుగారూ! నేను మా ఊరెళ్లిపోతాను. నా కేమీ జబ్బు లేదని చెప్పెయ్యండి. ఈ సంగతి మాత్రం చెప్పకండి" అని దీనంగా ప్రాధేయపడింది.

"చూడండి. నేను చెప్పేదంతా మీరు శ్రద్ధగా వినాలి. మీ ఊరు వెళ్లినా ఎబార్షన్‌కి ప్రయత్నించాల్సిందేగా? ఆ పల్లెటూళ్లో మోటువైద్యాలెంత ప్రమాదమో తెలుసా? అసలు నాలుగు నెలలు దాటితే ఏ మందులూ పనిచెయ్యవు. ఈ పరిస్థితిలో మంచి డాక్టర్ తప్ప మీ కెవ్వరూ సహాయం చెయ్యలేరు. మత్తుమందిచ్చి ఆపరేషన్ చేసి గర్భసంచిని క్లీన్ చెయ్యాలి. మీ తరఫున ఒక బాధ్యత గల వ్యక్తి సంతకం పెట్టాలి. ఎబార్షన్ చేయించుకోవచ్చని చట్టం వచ్చాక ఈ పద్ధతంతా వచ్చింది. బాధ్యత గల ఏ డాక్టరూ దీన్ని ధిక్కరించకూడదు. ఇదంతా రాజారావుకి తెలీకుండా ఎట్లా అవుతుంది? నా మాట వినండి. మీ కేం భయం లేదు. మీరు మీ ఊరెళ్లి అక్కడ ఏదో విషమించి. . . అప్పుడు సంగతి బయటపడిందంటే అతను ఇంకా కోపం తెచ్చుకోవచ్చు. నేనే అతనికి నచ్చ జెపుతాను."

శ్యామల ఏమీ అనలేకపోయింది. చెంపలమీద నుంచి కన్నీళ్లు ధారలుగా జారుతూంటే దీనంగా నిలబడింది.

ఆ అమ్మాయిని చూస్తూంటే డాక్టర్ మనసంతా ద్రవించినట్టయింది. "ఫర్వాలేదమ్మా! లోపల గదిలో కూర్చోండి" అన్నాడు ధైర్యమిచ్చుతూ.

శ్యామల డాక్టర్‌ని అపనమ్మకంగా చూస్తూ కళ్ల నీళ్లు ఒత్తుకుంటూ వెళ్లింది.

డాక్టర్ కుర్చీలో వెనక్కి వాలాడు. అతను ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదుర్కో లేదు. అనేకసార్లు ఎబార్షన్ కేసులు చేసినా ఇంత రహస్యంగా కాదు. పిల్లకి సంబంధించిన పెద్దవాళ్లే వచ్చి మాట్లాడుతూ ఉంటారు. ఇప్పుడీమెకి సంబంధించిన వాడు భర్తే! ఆ భర్తకి తెలీస్తే కొంప మునుగుతుంది.

ఏం చెయ్యటం సమంజసమో ఆలోచన పోవటం లేదు.

రాజారావు తనకి నాలుగైదు సంవత్సరాలుగా తెలిసిన వాడు. మంచివాడే. అయినా ఇలాంటి పరిస్థితిలో అత నెలా ప్రవర్తిస్తాడో తను ఊహించలేడు. పాతికేళ్లన్నా ఉండవతనికి. భార్యచుట్టూ ఏవేవో కోరికలల్లుకుని తియ్యటి కలలు కంటున్నాడు. ఈ సంగతి వింటే...? కష్టమే. ఏమైపోతాడో!

ఏవో అబద్ధాలాడి అసలు చెప్పకుండా పని జరిపిస్తే. . .? ఇంకో రకంగా తెలిసిపోతే? చదువు



నృత్యం
చిత్రం— డి. లలిత (వరంగల్)

కున్నవాడు. . . తెలివైనవాడు. ఆమాత్రం గ్రహించ లేడా?. . . అసలిది దాగే రహస్యమేనా? అయినా . . . మూర్ఖంగానే ఎందుకు దాచాలి? ఎవరికైనా పొరపాట్లు జరగవా? అసలు పొరపాటేముంది? యౌవనంలో ఆకర్షణలూ, ఆవేశాలూ ఎవరికి తెలియనివి? తెలిస్తే ఏం? అర్థం చేసుకుంటాడో లేదో చాదస్తుడు. ఆమెని వదిలేస్తే? ఏం వదిలేస్తే? అంత గ్రహించలేని మొగుడు వదిలేస్తే ఏం? ఆమె చాలా భయపడుతూంది. పొమ్మంటే ఏం చేస్తుంది? చివరికి ఏ ఆత్మహత్యో...! అబ్బ! ఎలా తేలుతుందిది? ఏదో ఒకటి సాధించాలన్న పట్టుదలతో డాక్టర్ తొందరగా తీరిక చేసుకుని రాజారావు కోసం కబురు పంపాడు.

రాజారావు చాలా సేపట్నించి కాచుక్కూర్చున్నట్టు ఆత్రుతగా లోపలికొచ్చాడు. నవ్వుతూనే ఉన్నాడు.

"ఇట్లా కూర్చోవోయ్!" అంటూ డాక్టర్ తన దగ్గిర కుర్చీ చూపించాడు.

రాజారావు కూర్చుంటూ— "శ్యామలేదీ?" అన్నాడు.

"లోపలుంది. తీరిగ్గా మాట్లాడుకోవచ్చుగదా అవి కొంచెం ఆలస్యం చేశాను మీ విషయం."

"ఫర్వాలేదు. ఏం జబ్బండి?"

"అబ్బే! జబ్బేం లేదు. బాగానే ఉంది."

ఏదో పెద్ద బారం దింపినట్టు అతను తేలికపడుతూ "అవునులెండి. జబ్బేముంటుంది? అస్తమానూ తలనొప్పి అంటూ ఉంటుందంతే" అన్నాడు నవ్వుతూ.

అతని మొహం చూస్తూంటే ఏం చెయ్యాలో మళ్లీ కొత్తగా ఆలోచన మొదలైంది. అంతలోనే నిర్లక్ష్యంగా నవ్వుతూ— "తలనొప్పికేం అదే పోతుంది గానీ. . . అసలు మీ ఆవిడ నిన్ను చూసి భయపడు తూందోయ్!" అన్నాడు.

రాజారావు సిగ్గుపడి— "ఛ! అదేం కాదు డాక్టర్!" అని నవ్వాడు.

"నిజమే. అదంతా సిగ్గు అనుకుంటున్నావు గానీ, తన మనసులో మాట నీకు చెపితే నువ్వేం అపార్థం చేసుకుంటావోనని అలా ముభావంగా ప్రవర్తిస్తూంది.'

రాజారావు చిరాకుపడి—"ఛ! ఛ! మీ రట్లా మాట్లాడకండి, డాక్టర్! నేను తనని అపార్థం చేసుకుంటానా? ఊహూఁ! ఆమె కలాంటి సందేహం ఏమీ లేదు" అన్నాడు నమ్మకంగా.

"నువ్వింత ధీమాగా చెపుతున్నావు, మరి నీకు చెప్ప కుండా ఎందు కంత బాధ పడుతోంది?"

"బాధపడుతోందా? ఎందుకు?"

"భార్య తన రహస్యం తనలో దాచుకుందంటే ఆమెకి తన దగ్గిర అంత చనువూ, ధైర్యమూ ఆ భర్త ఇవ్వలేదనేగా అర్థం?"

"నిజమే. కానీ నేను. . ."

"నువ్వు నాకు బాగానే తెలుసు, రాజారావ్! ఎంతో మంది కుర్రాళ్లకన్నా నువ్వు చాలా విశాలంగా ఆలోచిస్తావని అనుకుంటూ ఉంటాను. కానీ ఏదన్నా ఒక చికాకు సమస్య వచ్చిపడితే ఏంచేస్తావో నాకు సరిగ్గా తెలీదనుకో."

"అస లేమైంది, డాక్టర్‌గారూ?"

"అబ్బే! ఏదో ముంచుకొచ్చిందని కాదు. తెల్లారి లేస్తే ఇలాంటి కేసుల్లో ఎంతోమంది ఆడవాళ్లనీ, మగవాళ్లనీ చూస్తూనే ఉంటాం. కానీ ఆడవాళ్ల దురదృష్టం. దొరికిపోతారు. ఫలితం అనుభవించకుండా తప్పుకోలేరు."

రాజారావు గ్రహించే స్థితిలో లేడు. భార్య కేదో కాన్సర్‌లాంటిదో. . . కుష్ఠురాంటిదో. . . భయంకరమైన జబ్బు వచ్చిందని విపరీతంగా ఆందోళన పడుతూ, "ఏం జబ్బు, డాక్టర్? నిజం చెప్పండి. ఫరవాలేదు. నే నేమీ బాధ పడను. ఎంత కష్టమైనా వైద్యం చేయిస్తాను" అన్నాడు ఆవేశంగా.

"అవును. బాధపడడం కాదు మన మిప్పుడు చేయాల్సింది. ఏముంది ఇందులో? ఈజీగా తీసుకోవచ్చు. ఎంత షాక్ కలిగించే పరిస్థితిలో అయినాసరే మనం బాలెన్స్ తప్పకూడదు. శ్యామల కసలు జబ్బేం కాదు. చాలా ఆరోగ్యంగా ఉంది. ఆమె కిప్పుడు నాలుగో

నెల కడుపు." టేబుల్ మీద ఏవో కాయితాలు సర్దే నెపంతో డాక్టర్ మొహం తిప్పుకున్నాడు.

రాజారావు స్తంభించిపోయాడు. కాస్సేపు వెర్రి చూపు చూశాడు. తన్ను ఊహించినంత భయంకరమైన జబ్బేదీ రానందుకు ఒక్క క్షణం అతని కళ్ళు కాంతిగా వెలిగి జీవరహితంగా అయ్యాయి. క్రమంగా అతని చూపులు తీక్షణంగా మారి అసహ్యంతో మొహం జేవురించింది. కోపంతో కంపించసాగాడు. కొంతసేపు ఇద్దరి మధ్య నిశ్శబ్దంగా గడిచింది.

డాక్టర్ సాధ్యమైనంత అనునయంగా— ప్రాణ మిత్రుడు ప్రేమతో ఓదార్చినట్టు— "బాధపడకు, రాజారావ్" అన్నాడు.

రాజారావు తల వంచేసుకున్నాడు.

"నీకు చెప్పవద్దని ఆమె చాలా ఏడ్చింది. కానీ దానివల్ల పరిస్థితి ఇంకా విషమిస్తుందని. . ."

"ఛీ! ఛీ! నా కెందుకు చెప్పారు, డాక్టర్? అసలీ సంగతి నాకు తెలీకపోతే ఎంత బావుండేది!" అని విరుచుకుపడ్డాడు రాజారావు.



వాత్సల్యం    ఫోటో— ఆర్. బి. షిండే (కొల్హాపూర్)

"తొందరపడకు. శాంతంగా ఆలోచించు. జీవితం అంటే హాయిగా, సాఫీగా బ్రతికెయ్యటం కాదు. సమస్యలు వచ్చినప్పుడు ధైర్యంగా నిలబడాలి."

రాజారావు కోపంతో తల అడ్డంగా తిప్పుతూ— "నా వశం కాదు, నా వశం కాదు. ఇంత అసహ్యమైన సమస్య వస్తుందని నేను కలలోకూడా అనుకోలేదు" అన్నాడు. అతని కోపం క్షణక్షణానికీ ఇనుమడించి— "వాళ్ళంతా అంత తొందరపడి పెళ్ళి చెయ్యటానికి ఇదన్న మాట కారణం. ఎంత సాహసం, డాక్టర్! ఇంత గుండెలు్దీసిన మనుషు లుంటారని నా ఊహకికూడా అందలేదు. ఛీ! ఛీ! నన్నెంత మోసం చేశారు! అందరూ— ఆమెకూడా. . ." ఇక మాట్లాడలేకపోయాడు.

"మోసం అని నీ కనిపిస్తుంది గానీ, అది నిజం కాదు ఆ మోసం నిజంగా ఆ అమ్మాయినే ఎవరో చేసి ఉంటారు. ఏదో నిస్సహాయస్థితిలో పడి ఉంటుంది. అసలు సంగతేమిటో మనకి తెలీదు. కొంచెం సానుభూతితో ఆలోచించాలి."

"సానుభూతి ఎవరిమీద?" మండిపడ్డాడు రాజారావు. "నన్నింత మోసం చేసిన మనిషిమీదేనా? ఏదో మామూలు విషయం అయితే నేనూ ఆలోచించే వాణ్ణే. భరించేవాణ్ణే. తన కే కష్టం వచ్చినా నా ప్రాణ సమానంగా చూసుకునేవాణ్ణే. కానీ— ఇలాంటి ఘోర సమస్య నామీద విరుచుకుపడితే నే నేం మానవాతీతుణ్ణా, డాక్టర్, చలించకుండా ఉండడానికి?"

"మానవాతీతులంటే ఎవరు? ఈ చాదస్తాలన్నిటికీ అతీతంగా మనమే ప్రవర్తించకూడదా?"

"చాదస్తమా ఇది?" నిర్ఘాంతపోయాడు రాజారావు. డాక్టర్‌మీద అతనికి పట్టరాని కోపం వచ్చింది. "పెళ్ళి చేసుకున్న పన్నెండో రోజున భార్యకి నాలుగు నెలల కడుపు అని విని అసహ్యించుకోవటం చాదస్తం అంటారా మీరు?"

డాక్టర్ కుర్చీలో వెనక్కి వాలి నిర్లక్ష్యంగా— "నా దృష్టికి చాదస్తమే. మనం తప్పొప్పులు అనుకునే వాటి నిజమైన విలువలు గ్రహించగలిగేవాళ్ళందరికీ చాదస్తమే. ఒక్క క్షణం నీతి నియమాల సంగతి మరిచిపోయి విడిగా చూడు. మనిషి లోపల ఎన్ని బలహీనతలు! మనిషి చుట్టూ ఎన్ని విషవలయాలు! ఇష్టంగానో, అయిష్టంగానో మనం ఎన్నో పొరపాట్లు చేస్తూ ఉంటాం. దిద్దుకునే అవకాశం లేకపోతే, ఇవ్వకపోతే మనిషి ఏమైపోవాలి?"

రాజారావు కోపంతో రాజుకుంటూ — "ఇది పొరపాటా?" అన్నాడు.

"ఇంత తెలివితక్కువ స్థితి తెచ్చుకోవటం పొరపాటు కాకపోతే ఏమిటి? పదమూడేళ్ళ పిల్లకి పెళ్ళి చేసి. . . బలవంతంగా శోభనం గదిలోకి తోసి. . . బలాత్కరించి గర్భాన్ని దానం చెయ్యడం గొప్ప వేడుక మనకి. ఆ గర్భం నిలుపుకునే శక్తైనా లేక తల్లీ, పిల్లా కళ్ళు మూసినాసరే! అలా కాకుండా. చంద్రుణ్ణి చూసి కలువ వికసించినట్టు, మబ్బుల్ని చూసి నెమలి నాట్యం చేసినట్టు ప్రకృతి సహజంగా మధురమైన ఊహలతో పురుషాలింగనం కోసం తపించి అనుభవించటం మహా నీచం మనకి. ఇలాంటి విషయాలు ఆలోచించినప్పుడు ఏది చాదస్తమో ఏది మూర్ఖత్వమో స్పష్టంగా తెలియటం లేదా?"

రాజారావు డాక్టర్ని వింతగా చూస్తూ ఆశ్చర్య పడుతూ— "పెళ్ళి కాకుండానే పిల్లల్ని కనవచ్చంటారా? తప్పు లేదంటారా?" అన్నాడు కోపంగా.

"అసలు పెళ్ళయినా పిల్లల్ని కనకూడదు. ఇద్దరి ఆరోగ్యాలు, ఆర్థిక స్తోమతు, పిల్లలు కావాలనే కోరిక, సక్రమంగా పెంచే జ్ఞానం, అన్నీ ఉంటేగానీ పిల్లల్ని కలగనివ్వకూడదు. అలాంటప్పుడు పెళ్ళి కాకుండానే, పిల్లల్ని పెంచే ఏ అవకాశమూ లేకుండానే, తనెక్కడ నిలబడాలో ఆధారం దొరక్కుండానే పిల్లల్ని కనవచ్చు నని నే నెట్లా చెపుతాను? సంఘం ఎలాంటి విలువ ఇస్తుందో తెలిసికూడా సిరికిప్రియుల్ని నమ్ముకుని మోసపోయి ఇతర్లతో హేళనలూ, వెక్కిరింతలూ పడే దుర్భరస్థితి తెచ్చుకోమని నే నే ఆడపిల్లకీ చెప్పను. అసలు పెళ్ళి కాకుండా స్త్రీపురుష సంబంధాలు పెట్టుకున్నవాళ్ళెవ్వరూ పిల్లల కోసం కాదు, పైగా ఆ పిల్లల్ని పెరగనివ్వకూడదనీ— వాళ్ల రూపురేఖలు తుడిచిపెట్టాలనీ ఎన్ని ఘోరప్రయత్నాలు చెయ్యాలో అన్నీ చేస్తారు. అన్నీ విఫలమై ఓడిపోయి నిస్సహాయంగా ఆ బిడ్డని కంటారు. సంఘానికే కాదు కన్నతల్లికికూడా ఇష్టంలేని స్థితిలో పుడతారు ఆ బిడ్డలు. పుట్టీపుట్ట గానే ఏ కాలవగట్టునో, ఏ తుక్కుడబ్బాలోనో ప్రాణాలు విడుస్తారు. ఇలాంటి రాక్షసా లెన్నయినా చూసి సహిస్తాంగానీ, మన నీతి నియమాల్లో అవసరమైనప్పుడు చిన్న మార్పు చేసుకోలేం. ఆపదలో ఉన్న మనుషుల్ని వదిలి వీటిని అచంచలంగా కాపాడుకుంటాం."

రాజారావు అసహనం ఎక్కువౌతూంది.

"మీ రెక్కడో అమెరికాలో ఉన్నట్టు మాట్లాడుతున్నారు, డాక్టర్! మన పవిత్ర భారతదేశ సంస్కృతి..."

"చూడు, నాయనా! కన్నకూతుర్ని బలాత్కరించిన తండ్రి. . . చెల్లెలితో సంబంధం పెట్టుకున్న అన్న. . . ఉత్త అమాయకపు ఆడపిల్లల్ని వంచించిన బావలు, మేనమామలు, పినతండ్రులు — అంతా పవిత్ర భారత సంస్కృతిలో పుట్టి పెరిగి దాన్ని తిని తాగి జీర్ణించుకున్నవాళ్ళే. చదువుకోవటాని కొచ్చే ఆడపిల్లల్ని ఆశించే ట్రీచర్లు, ఉద్యోగాలకొచ్చే స్త్రీలని ఇబ్బంది పెట్టే ఆఫీసర్లు— ఎక్కడ వీలైతే అక్కడ తమ నీచత్వం ప్రదర్శించే ప్రబుద్ధులు— ఏ దేశంలో పుట్టి భారతదేశాని కొచ్చారు? పెళ్ళికాని పిల్లల్ని తల్లుల్ని చేసే ఇంత మంది పురుషోత్తములున్న నీ భారతదేశంలో ఇంకా పవిత్ర తెక్కడుంది? మనుషుల్ని వదిలి హిమాలయాల్లో, గంగానదుల్లో దాక్కుంది నీ సంస్కృతి. యౌవ్వనంలో ప్రకృతి కలిగించే మధురమైన కోరికలకీ, ఆకర్షణలకీ వంద దేశాల సంస్కృతుల, పవిత్రతల బలం కలిపినా చాలదు. సంఘమర్యాదలతోటే, సిద్ధాంతాలతోటే సంబంధం లేకుండా మనిషి బలహీనతలూ, పొరపాట్లూ అర్థం చేసుకుని ఆదరించగలిగే దేశం ఏదన్నా ఉంటే మనమంతా అక్కడికి వలసలు పోవటం చాలా ఉత్తమం. భారతదేశం గొప్పలు చెప్పుకుని గర్వపడి ప్రయోజనం లేదు. ఆ దేశంలోనే పుట్టి— ఒక భారతీయుడి మోసానికే గురైన ఒక స్త్రీ నీ కళ్ళముందు ఉంది. జరిగినదానికి సిగ్గుపడి నీకు మొహం చూపించలేక దీనంగా ఏడు

**సమస్యకి పరిష్కారం చావు కాదు. స్థలాల వైశాల్యాలూ, కిరసనాయిల్ డబ్బాల ఘనపరిమాణాలూ కట్టే లెక్కలేగాని, జీవితంలో ఎదురుపడే రకరకాల వ్యక్తుల హృదయ వైశాల్యాలూ, వారి ఆలోచనల ఘనపరిమాణాలూ కనుక్కోగలిగే లెక్కలు లేవు. మోసపోయిన ఆడదాని గుండె లోతుల్లో రగిలే మంటలను ఆర్పే సాహసం పురుషులకు లేదు. కారణం సంఘానికి బానిసత్వం, మూర్ఖంగా పదిలపరుచుకొన్న సమాజ పంజరంలోని సంస్కృతి. మనుషుల్ని చూస్తే మనుషులే భయపడే దుర్గతి. బాధస్రోతలకు అతీతంగా బ్రతుకు వెళ్లబుచ్చాలని సందేశం ఇవ్వగలిగిన మనిషికి అటువంటి సమస్యే ప్రశ్నార్థకమైనప్పుడు సమాధానం ఏం చెపుతాడు?**

స్తోంది. పెళ్లికి ముందే అంతా చక్కబరిచి పెళ్లి చేసి ఉంటే నీ భార్య ఎంతో సౌశీల్యవతి అని గర్వపడేవాడివి. నిజం తెలియకుండా దాచగలిగితే చాలు. అలాంటి విశేషాలు ఎన్ని జరగటం లేదు మన కుటుంబాల్లో? ఎంతో అన్యోన్యంగా బ్రతుకుతున్నారనుకునే ఏ భార్యాభర్తలనైనా ఎంత విచిత్రమైన విజాలున్నా ఆశ్చర్యపడక్కర్లేదు. సంసారాలు, కాపరాలు అనే అగాథాల్లో కప్పడి ఉంటాయి. అంతే."

"డాక్టర్! నా బాధ మీకేమీ అర్థం కానట్టు మాట్లాడతారెందుకు? నా పరిస్థితిలో ఆమే ఉంటే? . . . నేనే ఈ పెళ్లికి ముందు వేరే స్త్రీ ద్వారా ఒక బిడ్డనికని ఏవో కారణాలవల్ల ఈమెని పెళ్లి చేసుకుని ఉంటే?అప్పుడు మీరు నా గురించి ఇంత సానుభూతితో ఆలోచిస్తారా?" అని ప్రశ్నించాడు రాజారావు.

"ఎందు కాలోచిస్తాను?" అని ఎదురు ప్రశ్న వేశాడు డాక్టర్. "ఒక సంగతి చెపుతాను విను. నాకు తెలిసిన ఒక డాక్టరు ఉద్యోగం వచ్చిన కొత్త రోజుల్లో ఒక నర్సుతో సంబంధం పెట్టుకున్నాడు. అది ప్రేమ అనుకుని ఆ అమ్మాయి చుట్టూ తిరిగి తిరిగి ఉత్తరాలెన్నో రాసి రాసి చాలా దగ్గిర చేసుకున్నాడు. ఆమె గర్భవతి అయింది. పెళ్లికి కంగారుపడింది. అంతా మామూలే. అప్పుడు ఈ ప్రేమికుడికి తండ్రులూ తాతలూ, వంశమర్యాదలూ పురాతన సంస్కృతులూ అన్నీ గుర్తొచ్చాయి. పెళ్లికి ధైర్యం లేదు. ఏవేవో మాటలు చెప్పి ఆ అమ్మాయిని ఓదార్చాడు కొన్నాళ్ళు. పెళ్లికాకుండానే ఆమెకి ఆడపిల్ల పుట్టింది. అప్పటికే అతనికి చాలా కట్నం ఇతర లాంఛనాలూ ఇచ్చే సంబంధం కుదిరింది. "మా అమ్మ కోసం ఇలా చేయాల్సి వచ్చింది. ఈ సంఘం మన ప్రేమని బలి కోరింది. నన్ను క్షమించు" అని అమ్మనీ, సంఘాన్నీ అడ్డం పెట్టుకుని క్షమాపణ కోరి తప్పుకున్నాడు. ఆ భార్య కాపరానికొచ్చాక ఇతని సంగతి ఆమెకి తెలిసింది. ఏవో ఉత్తరాలవల్ల ఇతని కూతురు సంగతి కూడా బయటపడింది. ఆమె చాలా అసహ్యించుకుని అతని దగ్గిర్నుంచి వెళ్లిపోయింది. తరవాత ఆమె వచ్చిందో లేదో నాకు సరిగ్గా తెలియదు. నువ్వడిగిన ప్రశ్న కోసం ఈ విషయం చెప్పాను. ఆ నర్సు పరిస్థితిలో ఆ డాక్టర్ ఉండే అవసరం రాదు. అతనికే ఇష్టమైతే ఆమెనే పెళ్లి చేసుకునేవాడు. అతను మోసం చేశాడేగానీ మోసగించబడలేదు. ఏ మగవాడి సంగతయినా అంతే. ఒక స్త్రీతో సంబంధం పెట్టుకుని, బిడ్డని కని, ఇంకో స్త్రీని పెళ్లి చేసుకున్న మొగవాణ్ణి గురించి సానుభూతితో ఆలోచించవలసిన అవసరం ఏమీలేదు.

ప్రత్యేకంగా ఈ కేసులో ఆమెకి అతనితో సంబంధం గురించి కొన్ని రుజావులున్నాయి. కోర్టుకి వెళ్ళితే చట్టం ఆ తల్లిదండ్రుల్ని భార్యాభర్తలుగా గుర్తించదు కానీ ఆ బిడ్డకి పోషణ ఇప్పిస్తుంది. ఇచ్చే శక్తి ఉన్నవాడైతే. లేకపోతే చట్టం చెయ్యగలిగేదేమీ లేదు. కానీ ఆమె వెళ్లలేదు. అతనిమీద ప్రేమకన్నా ముఖ్యంగా ఏదో త్యాగం చేస్తున్నాననే భ్రాంతి.



జంట
చిత్రం — పి. ఆగాచార్య (కరీంనగర్)

అసలు ఇలాంటి కేసుల్లో ఇద్దరి మధ్య ఏ రుజావులూ ఉండవు. చాలా తేలిగ్గా మోసపోవడం తప్ప ఆడపిల్లలకింకో జ్ఞానం ఉండదు. ఆ నర్సుమీద జాలి కలిగినట్టే శ్యామలమీదకూడా నీకు జాలి కలగాలి."

రాజారావు స్పష్టంగా అయిష్టం వెల్లడిస్తూ— "మీ రెన్ని చెప్పండి, డాక్టర్! ఇదంతా భరించటం నా వశం కాదు. నా జీవితం సర్వనాశనం అయిపోయింది. బాధపడకుండా ఉండేంత శక్తి లేదు నాకు" అని నుదురు పట్టుకున్నాడు.

డాక్టర్ కొంతసేపు మౌనంగా ఊరుకుని నెమ్మదిగా అన్నాడు "సమయం వస్తేగానీ మనం ఎంత శక్తివంతులమో మనకు తెలీదు, రాజారావ్! ఈ సృష్టిలో ప్రతి జీవికీ ప్రాణాన్ని మించిన ఆశ ఏదైనా ఉందా? ఆత్మరక్షణే సృష్టిలక్ష్యం కదా? అలాంటి ప్రాణాల్నే ఎందరో మనుషులు ఏ చిన్న కార్యానికో సునాయాసంగా సమర్పిస్తారే! ఏ శక్తులున్నాయి వాళ్లకి? అలాంటి త్యాగాలకు ఎదగాల్సిన మనిషికి ఇది ఒక సమస్యా?"

"దానికీ, దీనికీ పోలిక పెట్టకండి. అవసరమైతే ప్రాణత్యాగాలు సైతం చెయ్యటానికి సిద్ధపడే దేశభక్తుడైనా, విప్లవకారుడైనా తన భార్య శీలం కలుషితమైతే సహించలేకపోవచ్చును."

"అదే నిజమైతే అతను దేశభక్తుడూ కాడు, విప్లవకారుడూ కాడు. సాటి వ్యక్తిపట్ల సానుభూతిలేని వాడికి దేశం ఎక్కడుంది? స్త్రీ శీలానికి హద్దులు పెట్టే వాడికి విప్లవం ఎక్కడుంది? అలాంటి అబద్ధపు త్యాగాల కోసం నిన్ను నేను ప్రోత్సహించటం లేదు. భార్యల శీలం గురించి మనం చెప్పుకునే అర్థాలు చాలా తొందరగా మార్చుకోవాలి. తరాని కో రకంగా ఆచారాలు మారుతోంటే ఏ నీతికైనా, నియమానికైనా నిలకడెక్కడుంది? జీవితం అమూల్యమైంది. ఇలాగే బ్రతకమనీ. . . ఇది తప్పనీ. . . అది ఒప్పనీ నిర్దేశించే శక్తి ఏ సిద్ధాంతానికీ లేదు. నీ సమస్యకి పరిష్కారం నీ మనసుకే తోచినప్పుడు ఇతర్ల మొహాల వేపు కన్నెత్తి చూడకు. సంఘభయం కన్నా నీచమైన బానిసత్వం లేదు. మూర్ఖత్వంతో చెడిపోయిన లోకాన్ని అనుసరించటంకన్నా, లోకం దృష్టిలో చెడిపోయిన స్త్రీని ఆదరించటం ఉన్నత లక్షణం. ఆలోచించి నీ పరిస్థితిని నువ్వే చక్కబరుచుకో."

రాజారావు విచారిస్తూ—"తలుచుకుంటేనే అసహ్యం వేస్తోంది డాక్టర్ నాకు. సిగ్గుపడకుండా చెప్తాను. మా సెక్సుజీవితం ఎంతో పవిత్రంగా ఉండాలని కోరుకున్నాను. నేను ఆమె కోసం బ్రతకాలి, ఆమె నా కోసం బ్రతకాలి అనుకున్నాను. నా భార్య జీవితంలో నా కన్నా ముందు ఇంకో వ్యక్తి ఆమె కెంతో సన్నిహితంగా వచ్చాడనుకుంటే— ఆ ఊహే నేను భరించలేక పోతున్నాను" అని మనసంతా బయటపెట్టాడు.

"నిజమే. ఆ నిజం దుర్భరంగానే ఉంటుంది. కానీ ఆ నిజం అబద్ధమైపోయిందన్న సంగతి నువ్వు గ్రహించాలి. అప్పటికీ ఇప్పటికీ, ఆమె మానసికస్థితి చాలా మారి ఉంటుంది. ఆమెకి సన్నిహితంగా వచ్చిన వ్యక్తి ఆమె జీవితంలో నిలిచిపోలేదు. అతని మోసం వల్లనో, ఇతర కారణాల వల్లనో అతనిమీద ఆమెకి చాలా కాలం కిందటే అసహ్యం కలిగి ఉంటుంది. ఆ

క్షణంలోనే అతను దూరమయ్యాడు. మీ ఇద్దరి మధ్య అనుబంధం బలపడితే ఆమె జీవితమంతా శాశ్వతంగా నిల్చేది నువ్వే. ఆమె అతనితో గడిపిన రోజుల్లో కొన్ని క్షణాలు హృదయపూర్వకంగా ఆనంద పడిందే అనుకో. ఆమె జీవితమంతా కలిసి ఆ కొన్ని క్షణాలేనా? మళ్లీ మళ్లీ కలిగే హృదయస్పందనకీ, ఆనందానికి హద్దు ఉందా? మళ్లీ మళ్లీ రేగే మధుర భావాలకి కళంకం అంటుతుందా? ప్రవాహంలాంటి జీవితంలో కొత్త ఊహలు, కొత్త అనుభూతులు కెరటాల్లాగ ముంచెత్తవా? ఎప్పుడో పాత జీవితంలోని కొన్ని క్షణాలు జీవితాన్నంతా పాలించి వైరాగ్యంతో నింపుతాయా? మీ రిద్దరూ పరస్పరం ప్రేమతో జీవితంలో స్థిరపడిన తరవాత ఎప్పుడో తెగిపోయిన పాత జీవితంతో ఇంక ఏం సంబంధం ఉంది?

రాజారావ్! నిన్ను ఒప్పించటానికి నే నిలా మాట్లాడు తున్నాననుకోకు. జీవితంలో ఇలాంటి సమస్య రాని వాళ్లకూడా ఇదంతా ఆలోచించాలి. మనం ఏ కాలంలో జీవిస్తూ ఉంటే ఆ కాలపరిస్థితులకి అనుకూలంగా ఆలోచనలు మళ్లించుకోవాలి. ఇప్పటి చదువులు, ఉద్యోగాలు, బయటి ప్రపంచంలో స్త్రీలూ పురుషులూ కలిసి మెసలవలసిన అనేక పరిస్థితుల్లో శ్యామలకు జరిగిన సంఘటనల్లాంటివి అప్పుడప్పుడూ తారసపడితే, మన కాలాని కిది చాలా సహజం అనుకుని స్వీకరించాలి."

రాను రానూ డాక్టర్ మాటలు వినటానికికూడా చాలా దుర్భరంగా ఉన్నాయి రాజారావుకి. అతని తల పగిలిపోతూంది. కణతలు నొక్కుకుంటూ పిచ్చిగా— "నా భార్య అనుకున్న క్షణంనుంచీ ఆమెని నెంత ప్రేమించానో మీకు తెలీదు, డాక్టర్!" అన్నాడు. అతని కంఠస్వరం భారమై పోయింది.

"ఈ పన్నెండు రోజుల్లోనేనా?" డాక్టర్ నవ్వాడు. వెటకారం ధ్వనించింది.

"పన్నెండు రోజుల్లో కాదు, పన్నెండు గంటల్లో ఆమె నా సర్వస్వం అయిపోయింది. ఆమె నెంతో సుఖ పెట్టాలనీ, ఎంతో ఆనందపెట్టాలనీ, ఎన్నో కొన్ని ఇవ్వాలనీ. . ."

డాక్టర్‌కి విసుగొచ్చి కుర్చీలోంచి లేచాడు. "అంత ప్రేమించినవాడివి ఈ విషయం గురించి ఇంత రాద్ధాంతం చేస్తావెందుకు? నీకు బాధ కలిగినప్పటికీ ఆమెని క్షమించవచ్చుకదా?"

"అదొక్కటే నాకు చాతకాదు."

"ఆమె దుఃఖపడటం నీ కిష్టమేనా?"

"దానికి నా బాధ్యతేం లేదు."

"నీ నిర్ణయంతో అటో ఇటో జరిగే విషయానికి నీకు బాధ్యత లేకపోతే ఎవరికుంది, రాజారావ్? నువ్వెంతో ప్రేమించాననుకుంటున్నావు. కాస్త మోటుగా చెప్పా లంటే అదంతా కొత్త మోజు. భార్యాభర్తల్ని సన్నిహితం చేసేది సెక్సు సంబంధాలు ఒక్కటే అనుకోకు. అడు గడుగునా స్నేహానికీ, సంపూర్ణమైన ఆత్మార్పణకీ, ఎన్నో త్యాగాలకీ జీవితం అవకాశమిస్తుంది. నీ ప్రేమకే పరీక్ష వచ్చింది అనుకోలేవా?"

"నా ప్రేమ ఇలాంటి నీతీ, నిజాయితీ లేని పరీక్షల కోసం కాదు."

డాక్టరు చాలా నిరుత్సాహంగా రెండు నిమిషాలు ఊరుకుని —"అయితే, నువ్విప్పు డేం నిర్ణయించు కున్నట్టు?" అని అడిగాడు.

"ఆమెని వాళ్ల ఊరు పంపించేస్తాను. నే నింత విషం తాగి చచ్చిపోతాను."

డాక్టర్ అదిరిపడ్డాడు. "వద్దు, వద్దు, రాజారావ్! తొందరపడకు. నీ భార్యతో నువ్వీ పది రోజులూ ఎంత మధురంగా గడిపావో మళ్లీ మళ్లీ జ్ఞాపకం తెచ్చుకో. ఆవేశంలో జరిగే హత్యలూ, ఆత్మహత్యలూ మనకి కొత్త కాదు. జీవితం తెచ్చే సమస్యలకి పరిష్కారం చావు కాదు. నేనే నీ స్థానంలో ఉంటే . . ."

రాజారావు విసురుగా— "మీతో నన్ను పోల్చకండి. నేను నేనే. నా కిష్టమైనట్టే నేను చేస్తాను" అంటూ కుర్చీ వెనక్కి తోసి లేచాడు.

"అయితే ఈ సంగతి నీకు చెప్పి చాలా తప్పు చేశాను."

"అందుకు మాత్రం మీకు చాలా కృతజ్ఞుణ్ణి— నా కళ్లు తెరిపించారు."

శ్యామల పక్క గదిలోంచి చాలా మాటలు వింది. చివరికి కళ్లు తుడుచుకుని వచ్చి గోడవైపు తిరిగి నిలబడింది. ఆమె కెంతో అన్యాయం చేసినట్టు ఆమె మొహం చూడటానికి చాలా సిగ్గుపడ్డాడు డాక్టర్.

రాజారావు గదిలోంచి బయటికి వెళ్లిపోయాడు. శ్యామల అతని వెనక నెమ్మదిగా నడిచింది. ఆమె వరండా మెట్లు దిగుతూంటే అతను కాంపౌండ్‌గేటు దాటాడు.

డాక్టర్ దోషిలాగ నిలబడ్డాడు.

• • •

వెన్నెల మసక మగ్గా ఉంది. ఆకాశం నిండా మబ్బులు చంద్రుణ్ణి చిన్నవాణ్ణి చేసి క్షణాని కోసారి పొట్టన పెట్టుకుంటున్నాయి. రఘునాథ్ ఇంటిముందు లాన్‌లో కూర్చుని ఆకాశం కేసి చూస్తున్నాడు. మబ్బుల్లో పడి చంద్రుడు మాయమైనప్పుడల్లా అతని ప్రాణం కొట్టుకుంటూంది. అతనికి అస్తమానూ శ్యామల గుర్తొస్తూంది. అస లతను శ్యామలనిగానీ, రాజారావుని గానీ పొద్దుటినించీ ఒక్క క్షణంకూడా మరిచిపోలేదు. "నేను చాలా పొరపాటు చేశాను సుజా!" అన్నాడు ఎన్నోసార్లు. ఆ రాత్రి భోజనంకూడా చాలా అనాసక్తిగా చేశాడు. శ్యామలకి ఇష్టం లేకుండా ఆమె సంగతి అతనికి చెప్పటం చాలా తప్పనిపిస్తూంది.

"ఏమిటి? అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" అంది సుజాత కొంతసేపు మౌనంగా కూర్చుని.

"ఇంకేముంది? నేను చేసిన ఘనకార్యం గురించి తీరిగ్గా పశ్చాత్తాప పడుతున్నాను" అన్నా డతను విచారంగా.


"మరి అతని కెందుకు చెప్పావు తొందరపడి?"

"ఎలాగైనా ఒప్పించగలననుకున్నాను సుజా!" అన్నాడు రఘునాథ్ దోషిలాగ. "ఎప్పుడూ చాలా మంచిమాటలు మాట్లాడేవాడు. కమ్యూనిస్టుననేవాడు. ఇంత మూర్ఖుడనుకోలేదు" అని విచారించాడు.

"ఏ ఇజమ్ము అయినా ఇలాంటి విషయంలో ఒకటే అనుకుంటాను" అంది సుజాత విరక్తిగా.

"అంతేనా? మనుషు లెప్పుడూ ఇంత సంకుచితం గానే బతుకుతారా?"

ఇద్దరూ నిస్సహాయుల్లాగ మౌనంగా కూర్చున్నారు. రఘునాథ్ మౌనం భరించలేనంత అశాంతితో— "ఆ అమ్మాయినేం కొట్టి, తిట్టి హింసిస్తున్నాడో దరిద్రుడు. ఇక ఏ డాక్టరూ ఎబార్షన్ చేయించక్కర్లేదు. అతనే ఏ కర్రతోనో బాది, చంపి ఏ నూతిలోనో పారేస్తాడు. ఎన్ని కేసులు ఇలాంటివి! అన్నీ తెలిసి తెలిసి నేనీ పొరపాటు చేశాను. అదే నా బాధంతా" అని



పైపైకి

ఫోటో— డి. శద్రాడీ (మద్రాసు-17)

నుదురు పట్టుకున్నాడు. "నేనే ఏదో అబద్ధమాడి ఆమె రహస్యం బయటపడకుండా చేసేస్తే ఎంత బావుండేది! భయంతో నాకు నమస్కారం పెట్టి రక్షించమని ఏడ్చిన పిచ్చిపిల్లని రాక్షసంగా ఆ భర్తకే అప్పగించాను."

సుజాత భర్తని కొత్త వ్యక్తిని చూసినట్టు చూడ సాగింది.

"ఏ కష్టానికైనా సానుభూతి దొరుకుతుంది గానీ... చిన్నవయసులో ఆడపిల్లలకు ఇలాంటి దుర్భరస్థితి వస్తే ఎంత ఏడుస్తారో, ఆ సంగతి గ్రహించిన క్షణంనుంచీ వాళ్లెంత నరకయాతన పడతారో. . . అర్థం చేసుకోగలిగితే ముందు వాళ్లనే ఆదుకోవాలి. వాళ్లకే ధైర్యం ఇవ్వాలి."

రఘునాథ్‌ని చూస్తూన్నకొద్దీ సుజాత మనసంతా సంచలనం ప్రారంభమైంది.

"ముందు ఆ అమ్మాయిని అతని చేతుల్లోంచి బయటికి తీసుకురావాలి. తరవాత ఏదో ఒకటి చెయ్య వచ్చు" అన్నా డతను పట్టుదలగా.


సరిగా— ఆ లేతవెన్నెల రాత్రి— శాంతి నిచ్చే ఆ వల్లటివేళ— నిశ్శబ్దమైన మసక చీకటిగదిలో— శ్యామల రాజారావు చేతుల్లో ఆ పది రోజుల్లో అనుభవించనంత ఆనందంతో విశ్రాంతి తీసుకుం టూంది. అతను ఆమె తల నిమురుతూ దగ్గిరకి ఒత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు.

ఉదయం హాస్పిటల్‌నించి ఇద్దరూ ఇంటికొచ్చిన తరవాత రాజారావు తిన్నగా గదిలోకి పోయి తలుపులు వేసుకున్నాడు. కుర్చీలో కూర్చుని టేబుల్‌మీద తల ఆన్చుకున్నాడు. అతనికి భరించలేనంత దుఃఖం వచ్చింది. తలబద్దలు కొట్టుకుని చచ్చిపోదామనుకున్నాడు. కన్నీళ్ల పొంగి ప్రవాహం కడుతూంటే ఏ సంకోచమూ లేకుండా ఏడ్చాడు.

అతనా స్థితినించి కొంతసేపటికి తేరుకోగలిగాడు. మనసు కొంత శాంతపడి, పరిస్థితిని కొంత జీర్ణించి ఇముడ్చుకుంది. ఆలోచన ప్రారంభమైంది. డాక్టర్ ప్రశ్నలకి తను చెప్పుకునే సమాధానాలు తనకే చాలా అసంతృప్తిగా కనిపించాయి. శ్యామల రైలు ఎక్కి వెళ్లిపోవటం ఊహించి కంపించాడు. తరవాత ఆమె ఏమౌతుంది? తనేమౌతాడు? మళ్లీ ఇంకో స్త్రీ. . .? మళ్లీ ఏదో విషాదస్థితి. . .? భరించలేననుకున్నాడు.

శ్యామల తన దగ్గిరకి వచ్చిన క్షణంనించీ తన జీవితవిధానమే మారినట్టయింది. ఆమె సంతోషించి నప్పుడు తనకి సంతోషం కలిగింది. ఆమె బాధపడితే తనకి దుఃఖం వచ్చింది. ఆమె చిరునవ్వు కోసం ఆరాటం, ఆమె ప్రసన్నత కోసం తాపత్రయం ఆమె పెంకి తనంలోకూడా తన కెన్నడూ లేని సహనం, తన సర్వస్వమూ ఆమె తప్ప తను అనేది ఏమీ మిగల కుండా అయింది. తన అంతరంగంలో ప్రేమాంకురాల చలనం జరిగింది ఆమెని చూశాకే. తన అద్భుత శృంగారజీవితానికి ఆలంబనం అయింది ఆమె ఒక్కతే. అంత అందమైన సిగ్గులో, ఆమె ఆలింగనంలో 'జీవితం ఇంత రమ్యమైనదా?' అని విభ్రాంతి కలిగింది. లోకమే రంగురంగుల ఇంద్రధనుస్సు అంచున వెలిగింది.

అలాంటి మధుర స్వప్నాలమధ్య ఈ భయంకరమైన పీడ కల! ఇంత అసహ్యకరమైన వంచన!!



**లక్ష్మీనారాయణులు (రేవా)**
**ఫోటో— ఎమ్. ఎస్. మూర్తి (రాజ్‌కోట్)**

శ్యామల గురించి తనకేమీ తెలియకుండా రోజులు గడిచిపోతే ఎంత బావుండేది! ఈ రహస్యం రహస్యంలాగ మాసిపోతే, తను శ్యామలతో ఎప్పట్లాగే ఎంత ఆనందంగా కాలం గడిపేవాడు!

రాజారావులో అశాంతి మళ్లీ తల ఎత్తింది. అతని మనసంతా ఆక్రమించిన ఆమె అందమైన కళ్లు, తన హృదయపు లోతుల్లోకి తాకినట్టు అనుభూతి కలిగించిన ఆ మృదువైన చూపులు, వాటిలో అస్పష్టంగా భయసంకోచాలు, నిశ్శబ్దంగా ఊరే కన్నీళ్లు, తను అప్రయత్నంగా వాటిని తుడిచి దగ్గిర చేసుకోవటం, గొప్ప ఆలంబన దొరికినట్టు ఆమె తనని అల్లుకోవటం— తన అంతరంగంలోంచి మధుర మైన పులకరింతలు, ఆకలి నిద్రల్నీ, సమస్తాన్నీ విస్మరించిన తన్మయత్వం. . . అంతే. . . అంతే జ్ఞాపకం.

తన కింకా స్ఫురిస్తూన్న ఆ చూపుల్లో ఏదో దీనత్వం, నిర్మలత్వం తప్ప, తనని కరుచుకోవటంలో అపారమైన నమ్మకం, ఆశ్రయాన్ని కోరే ఆరాటం తప్ప ఎక్కడా నటన, వంచన తన కసలు గుర్తులేదు.

శ్యామల గురించి అతని మనసంతా క్షమతో, ప్రేమతో నిండసాగింది. ఆమె సాహచర్యంతో గడిపిన దివ్యక్షణాల బలం అతని కేదో నూతన శక్తి నిచ్చింది. ఆమె గురించి తన అపార్థాలు, సందేహాలు, అసహ్యాలు వదుల్చు కోవాలనీ, ఆ సాహసానికి తనను తను సంసిద్ధుణ్ణి చేసుకోవాలనీ అతనిలో ప్రతి అణువూ పెనుగులాడింది.

రాజారావు ఆలోచిస్తూ గంటలు గంటలు గడిపే శాడు. రాత్రి చీకటి పడేవరకూ గదిలో ఒంటరిగానే ఉన్నాడు. బయట శ్యామల ఏ అఘాయిత్యానికి పూనుకుందోనని ఆందోళన కలిగిన వెంటనే కంగారు పడి తలుపులు తీశాడు.

వంటింటి గుమ్మంలో మోకాళ్లమీద తల ఆన్చుకుని చీకట్లో కూర్చున్న శ్యామల, గది తలుపులు తీసిన చప్పుడుకి చటుక్కున లేచి నిలబడి తల వంచుకునింది.

రాజారావు అక్కడే నిలబడి ఆమెని చూశాడు. ఆమె దోషిలాగ తన తీర్పుకి ఎదురుచూస్తూన్నట్టు కనిపిం చింది. తను ఉండమంటే ఉంటుంది. వెళ్లిపొమ్మంటే వెళ్లిపోతుంది. తనని ధిక్కరించి నిలబడలేని నేరం చేసింది. ఆమెని స్వీకరించినా, తిరస్కరించినా సమాజం, చట్టంకూడా తన ఇష్టాన్నీ, హక్కునీ కాపాడతాయి.

రాజారావు చలించిపోయాడు. ఏ హక్కులూ, ఆస్తులూ లేని, ఏ నీతులూ, నియమాలూ పాటించని మానవుడి హృదయంలో పెనుగులాడే స్పందన అతన్ని వివశుణ్ణి చేసింది. స్వరం నిండా ఆత్మీయత నిండగా— "శ్యామూ!" అన్నాడు. తల ఎత్తి సంభ్రమంగా చూసింది. కన్నీళ్లు జలజలా జారిపడ్డాయి.

రాజారావు అప్రయత్నంగా ఆమె దగ్గిరకి వచ్చి, "తప్పు. ఊరుకో" అన్నాడు.

శ్యామల అతన్ని పెనవేసుకుని బావురుమంది. ఆపదలో మునిగిన బలహీనుల్నీ, అనాథల్నీ ఆదుకో గలిగిన ధీరత్వంతో, గాయపడి విలవిలలాడే పక్షికి సేవచేసే కారుణ్యంతో ఆమె తల మృదువుగా నిమిరాడు.

"నే నేంతో తప్పు చేశాను. మీ కెంతో ద్రోహం చేశాను. న న్నెందుకు క్షమిస్తారు?" అని ఏడ్చిం దామె.

"ఊరుకో, శ్యామలా! ఏడంతా ఎందుకు? నే నింక నిన్నేమీ అడగను. ఒక్క ప్రశ్నకూడా వెయ్యను. నువ్వేం భయపడకు. మనం ఎప్పట్లాగే సంతోషంగా ఉందాం" అన్నా డతను.

ఆమె మాటలు రాక మౌనంగా ఏడ్చింది. ఆ రాత్రే దాచుకోలేక విషయమంతా చెప్పింది.

శ్యామల మేనత్తకి ఆస్తి బాగా ఉంది. శ్యామలని తన కొడుక్కి చేసుకోవటాని కిష్టపడలేదు. తల్లి లెక్క లేదనీ, నిన్నే చేసుకుంటాననీ శ్యామల బావ నమ్మకంగా చెప్తూ ఉండేవాడు. సంబంధం స్థిరపడుతుందనే ఆశతో శ్యామల తలిదండ్రులుకూడా శ్యామలని బావతో చనువుగా తిరగనిచ్చారు. శ్యామల మేనత్త తన అభి ప్రాయం వాళ్ల దగ్గిరా, పెళ్లి దగ్గిరా, బయటపెట్టి, కొడుక్కి వేరే సంబంధాలు చూడడంతో రెండు కుటుంబాలమధ్య స్పర్ధ లెక్కువయ్యాయి. శ్యామల నాయనమ్మ కూతురికీ, కొడుక్కీ వచ్చిన స్పర్ధలకి బెంగ పెట్టుకుని మంచం పట్టింది. కూతురుమీద కోపంతో కొడుకు పక్షం చేరి, మనమరాలికి వేరే సంబంధం చూడమని పోరు మొదలు పెట్టింది. శ్యామల తండ్రి పౌరుషపడి కూతురికితొందరగా పెళ్లి చేసేసి బంధువు లతో సెభాషనిపించుకుంటానని పంతం పట్టాడు. చివరికి శ్యామల మేనమామ ప్రయత్నం వల్ల, ముఖ్యంగా శ్యామల అందం వల్ల సంబంధం కుదిరింది.

శ్యామలకి మూడో నెల జరుగుతోంది. బావని అర్జంటుగా రమ్మనీ, చాలా ముఖ్యమైన విషయం

చెప్పాలనీ చాలా ఉత్తరాలు రాసింది. అతను ఒక్క సమాధానంకూడా ఇవ్వలేదు. పెళ్లికి లగ్నం పెట్టేశారు. శ్యామల ఆందోళన ఎక్కువయింది. తన సంగతి ఎవ్వరికీ చెప్పే ధైర్యం లేదు. రహస్యంగా ఏ మందన్నా తీసుకునే అవకాశం లేదు. చాలా సార్లు చచ్చిపోదా మనుకుంది. ఏమీ చెయ్యలేని స్థితిలో పెళ్లి జరిగిపోయింది.

"ఈ విషయం మీకు తప్ప ఎవ్వరికీ తెలియదు. నా పెళ్లి అని తెలిసినప్పుడుకూడా అతను కదిలి రాలేదు. అప్పటినించీ అతనిమీద నా కెంతో అసహ్యం కలిగింది. నా మీద నాకే చెప్పలేనంత కోపం వచ్చింది. మిమ్మల్ని మోసపుచ్చుతున్నాననే భయంతో నేను ప్రతి రోజూ ఎలా గడుపుతున్నానో చెప్పలేను. ఈ రెండు మాటలూ నమ్మండి. నన్ను మీ రేం చేసినా సరే!" అని దీనంగా



విరగ గాసి ...

ఫోటో — ఎస్. ఎన్. రావు (మద్రాసు-28)

చూసింది శ్యామల. సిగ్గుపడకుండా, ఏడవకుండా ధైర్యంగా, ఆవేశంగా మాట్లాడింది. రాజారావుకి ఆమె మాటల్లో ఏమీ నటన కనపడలేదు. "ఆదంతా మరిచిపో, శ్యామలా! నీ మీద కోపం ఎప్పుడో పోయింది. రేపు డాక్టరుగారి దగ్గరికి వెళదాం" అన్నాడు.

శ్యామల నమ్మలేనట్టు చూసింది.

ఆమె మొహమంతా అలుముకున్న కాంతి, చూపుల్లో నిండిన కృతజ్ఞత, తన మీద ఏర్పడ్డ విశ్వాసం చూస్తే రాజారావుకి తనమీద తనకే గౌరవం కలిగింది. జీవితానికంతా తేజస్సు ఇచ్చే ఉన్నత కార్యం చేశాననిపించింది. మనసులోనే మొక్కరిన్నాడు డాక్టర్ రఘునాథ్ కి.

• • •

రఘునాథ్ ఆలోచనల్లోంచి తేరుకుని— "ఆ అమ్మాయి విషయం ఏమైందో రేపు తప్పకుండా చెప్పగాడాలి, సుజా! ఓసారి అతని దగ్గరకి వెళతాను" అన్నాడు.

సుజాత రఘునాథ్ నే చూస్తూ దీర్ఘంగా ఆలోచిస్తోంది.

వెన్నెల బాగా తగ్గింది. ఆకాశం నక్షత్రాలతో ధగధగామెరుస్తోంది. గార్డెన్ నిండావిచ్చినపూలునువాసన లీనుతున్నాయి. చల్లగాలి సుకుమారంగా, పరవశంగా తాకుతూంది.

సుజాత భర్తని భక్తిపూర్వకంగా చూస్తూ— "నీ మనసెంతో సున్నితమని తెలిసికూడా ఇన్ని సంవత్సరాలు నిన్ను అర్థం చేసుకోకుండా ఎలా ఉన్నానో నాకే ఆశ్చర్యంగా ఉంది, రఘూ!" అంది.

రఘునాథ్ నవ్వి— "పోనీ ఇప్పటికైనా అర్థమైనట్టేనా?" అన్నాడు.

ఆ మెత్తని నవ్వు, ఎప్పుడూ నమ్మకంగా దొరికే ఆ నిర్మలమైన ప్రేమ, తనకి స్నేహమైన క్షణం నించీ అతనిలో చూస్తూన్న సంస్కారభావాలు, ఆ ప్రశాంత పరిసరాల్లో తన ప్రియుని సామీప్యం— అన్నీ ఆమెకి ఎన్నడూ లేని కొత్త ఆవేశాన్ని కలిగించి, "రఘూ! నీ కో సంగతి చెప్పనా" అంది.

రఘునాథ్ ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ, "చెప్పటానికి నా పర్మిషన్ అడుగుతున్నావా?" అన్నాడు.

"ఆవును. అలాంటిదే. నువ్వు శాంతంగా వినాలి. ఈ రహస్యం నీకు చెప్పెయ్యాలని ఎన్నిసార్లు బలహీనపడ్డానో! ఎలాగో నిగ్రహించుకున్నాను. ఎక్కడ నీ ప్రేమ పోగొట్టుకుంటానో అన్న భయంతో నా బాధంతా నా మనసులోనే దాచుకున్నాను."

"ఏమిటి, సుజా, నువ్వు మాట్లాడేది?" రఘునాథ్ ఆశ్చర్యపడ్డాడు.

"నేనుకూడా పన్నెండేళ్ల కిందట శ్యామల లాగ ఒక భయంకరమైన స్థితిలో పడ్డాను."

"అంటే?" ఆశ్చర్యపడ్డాడు.

"నేను మా అత్త దగ్గిరుండి చదువుకునే రోజుల్లో— నాకు పదిహేను సంవత్సరా లప్పుడు— ఆవిడ మొగుడు నా విషయంలో పశువులా ప్రవర్తించాడు. నా కప్పు డేమీ తెలీని వయసు. ఎవరికి చెప్పాలన్నా సంకోచం. ఆ దుర్మార్గుణ్ణి ధిక్కరించాలంటే భయం. ఆ రోజులు గుర్తొస్తే నా కిప్పటికీ గుండెల్లోంచి వణుకువస్తుంది. కొన్నాళ్లకి నే నా ఘోరం భరించలేక, తెలివి తెచ్చుకుని మంకుపట్టు పట్టి అన్నం తినటం కూడా మానేసి మా అమ్మ దగ్గరికి వచ్చేశాను."

సుజాతకి నెల తప్పకపోతే అస లా విషయమంతా ఒక పీడ కలలాగ మరిచిపోయేదే. ఆ ఘోరంకూడా జరగటంతో ఆ పిల్ల అందరి దృష్టికీ మహా నీచురాలైంది.

"పాపిష్టి దానా! నా పరువు తీశావే!" అని తండ్రి ఆ లేత ఒళ్ళు చిట్లి రక్తాలు కారేంత వరకూ కొట్టి శాంతపడ్డాడు. చంపుతానని కంఠం నలిపి, ఎవరో అడ్డుపడితే ఉరికాడు కళ్లల్లో మెదిలి వదిలిపెట్టాడు.

"మమ్మల్ని నవ్వులపాలు చేశావే! నీ కామాత్రం జ్ఞానం లేదటే?" అని తల్లి సన్నగా శోకాలు తీస్తూ శాపనార్థాలు పెట్టింది.

సుజాత కా జ్ఞానం ఎందుకు లేదో, ఉండిమాత్రం ఏం చెయ్యగలదో ఆ జ్ఞానవంతురాలు ఊహించలేదు. సుజాత చదివే క్లాసు పుస్తకాల్లో పొలాల, స్థలాల వైశాల్యాలు, కిరసనాయిల్ డబ్బాల ఘనపరిమాణాలు కట్టే లెక్కలేగానీ, జీవితమంతా తారసపడే రకరకాల వ్యక్తుల హృదయ వైశాల్యాలూ, వారి ఆలోచనల ఘనపరిమాణాలూ నా కముక్కొగలిగే లెక్కలు లేవు. చరిత్ర పాఠాలనిండా యుద్ధాలూ, సంధులూ, రాజ్య కాంక్షలూ, గుళ్లమీదా గోపురాలమీదా అలరారే శిల్పకళలూ, దేశ విదేశాల్లో వన్నెకెక్కిన పవిత్ర సంస్కృతుల అపవిత్ర వర్ణనలేకానీ, ఏ భయంకర చీకటి రాత్రో ఆదమరిచి నిద్రపోయే అమాయకపు ఆడపిల్లలమీద పశుకామంతో మీదపడే నీచుల వర్ణనలు గానీ, రాక్షసబలంతో బలాత్కరించి తల్లుల్ని చేసే దుర్భర సంఘటనలుగానీ, అజ్ఞానంతో భయంకర సుఖ వ్యాధులపాలై జీవితమంతా నరకయాతన భరించిన నిర్భాగ్యుల మానసిక సంఘర్షణలుగానీ— సుజాతని జ్ఞానవంతురాల్ని చెయ్యగల ఒక్క అంశమైనా లేదు.

తప్పంతా తనదేనని ఆ పిల్ల తిట్లూ, దెబ్బలూ భరించి ఊరుకున్న తరవాత అందరూ శాంతించారు. తరవాత ఆ తప్పు తుడిచేసుకునే ప్రయత్నాలు. అబ్బ! ఎన్ని మందులు మింగించారో! ఆ పిల్ల చచ్చిపోయేంత జబ్బు చేసిందేగానీ, అనుకున్న పని జరగలేదు. సృష్టికి ఆ బలం ఎక్కడిదో, శిశువు ఆ చిన్ని గర్భకోశాన్ని పట్టుకు వదల్లేదు.

"చివరికి ఎవరో చెపితే ఆ రాత్రికి రాత్రే ప్రయాణం కట్టించి, నన్నేదో ట్రెయినింగ్ లో చేర్పిస్తున్నామని అందరికీ చెప్పి హైదరాబాద్ 'రాధాకిషన్ హోమ్'కి తీసుకువెళ్లారు" అంది సుజాత.

"ఎందుకు?" ప్రయత్నంగా అడిగాడు రఘునాథ్.

"అక్కడ నా లాంటి దౌర్భాగ్యుల్ని ఆదుకుని రక్షించటానికి భగే అనే ఒక పుణ్యాత్ముడు ఆ సంస్థ స్థాపించాడట."

పెళ్లి అనే ముసుగు ఎరగని ప్రకృతి ఆడపిల్లల్ని తల్లుల్ని చేస్తే ఆ నేరానికి వాళ్ల జీవితమంతా ధ్వంసం కాకూడదనే వాత్సల్యంతో, వారి కన్నీటిబొట్లు తుడిచి సేద తీర్చాలనే అపారమైన కరుణతో ఆ సంస్థలో రహస్యంగా పురుళ్లు పోసి ఇళ్లకు పంపిస్తారు.

సమాజం విధించే ఆంక్షలకీ, శిక్షలకీ తల లొంచి ఆ లేత వయసు తల్లులు చిన్నారి బిడ్డలని ఆఖరి ముద్దు పెట్టుకుని, ఆఖరి చూపు చూసి శాశ్వతంగా వీడ్కోలిచ్చి వెళ్లిపోతారు.

"నేనుకూడా అలాగే వచ్చాను, రఘూ! వింటున్నావా?" అంది సుజాత భారమౌతున్న కంఠంతో.

వింటున్నాడు రఘునాథ్. విని భరించాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు.

"ఊc చెప్పు, సుజా!"

"హైదరాబాదులో నన్ను తీసుకెళ్లటానికి ఆ హోమే లేకపోతే నన్నింకా నాటుమందులు తాగించి తాగించి చంపేసేవాళ్లు, రఘూ! చావు తప్పించుకుని బ్రతికినందుకు సంతోషిస్తున్నా ననుకోకు. ఇప్పు డున్నంత జ్ఞానం, ఆలోచనా అప్పుడే ఉంటే ఎన్ని మందులైనా, ఎలాంటి గరళాలైనా మింగి చచ్చిపోవటానికే సిద్ధపడే దాన్ని కానీ, బిడ్డను కని వదలటానికి ఒప్పుకునేదాన్ని కాదు. ఏ కన్నతల్లికీ దాన్ని మించిన చిత్రహింస లేదు."

సుజాత కెంతో జుగుప్స కలిగించే స్థితిలో ఆ బిడ్డ తయారైనా, కడుపులోంచి ఆ బాధ పోగొట్టుకోవాలని అహోరాత్రులూ ఏడ్చినా, వాడు పుట్టగానే హృదయంలోంచి తెరలు తెరలుగా పుట్టెడు ప్రేమ కూడా పుట్టింది. చీరలు కట్టుకోవటంకూడా చేతకాని వయస్సులో వాణ్ణి కని, హఠాత్తుగా ఎన్నో సంవత్సరాలు పెద్దదై పోయింది. వాణ్ణి తల్లి కడుపులోంచి విడదీయాలని ఆదినించీ ఎన్నో ప్రయత్నాలు చేసి, ఓడి, చివరికి వాడు తల్లి ఒళ్లోకి రాగానే ఆ ఇద్దర్నీ విడదీశారు. తల్లి ఆ బిడ్డని ఎత్తుకోకూడదు. పాలివ్వకూడదు. ప్రేమ పెంచుకోకూడదు. నిశ్చింతగా ఆ బిడ్డని వదిలేసి, ఇంటికి వెళ్లి తలిదండ్రుల్నీ, బంధువుల్నీ, పెద్దల్నీ— అందర్నీ మర్యాదస్తుల్ని చెయ్యాలి. సంఘ శాంతి కాపాడాలి. పవిత్ర హిందూదేశ సంస్కృతిని రక్షిం

ఎందరు లేతతల్లుల గర్భశోకాలతో విల్లసిల్లు

ఈ సంస్కృతి!

"అప్పుడు నా కిలాంటి ఆలోచనలేవీ రాలేదు. వాణ్ణి వదిలి వెళ్లిపోవాలని పిచ్చిదానిలాగ ఏడ్చాను. వాడు పడుకుని ఊగే ఉయ్యాల ఇప్పటికీ నా మనసులో అలాగే ఊగుతూంది. ఆ ఒక్క ఉయ్యాలేనా? తల్లులంతా నాలాగే ఆ ఉయ్యాల చుట్టూ తిరిగి ఏడ్చి ఏడ్చి వెళుతూ ఉంటారు."

ఆ దయనీయ దృశ్యాలు గుర్తొస్తే ఇప్పు డనిపిస్తుంది సుజాతకి— భగే మహాపాన్నతుడే. కరుణా సముద్రుడే. కానీ ఎంత పిరికివాడు! ఆయన చేసింది మాత్రం ఏమిటి? సమాజానికి అడుగులకు మడుగు లొత్తటమే కదా? ఎలా ఉన్న ఆచారాల్ని అలా ఉంచి గౌరవించటమే కదా?— 'మీ విషయాలు రహస్యంగా దాచుకోండి. కొన్నాళ్లు ఇక్కడ దాక్కోండి. తరవాత మీరుకూడా ఏమీ ఎరగనట్టు గర్వంగా అందరిమధ్యా తిరగండి' అని రహస్యాన్ని రక్షించటమే కదా? ఆ హోమ్‌లో ఉండి వెళ్లినవా రెవరికీ సమాజ దృక్పథం మార్చలేదు— 'నీ కీ బిడ్డ కలగటంలో దోషం ఏమీ

# వసంతర్తు గానం

కల్హారమాలికలు చేతబూని
కైశికీగీతాలు పాడుతూ
పలుకుతున్నాను వసంతానికి స్వాగతం
పరీధావికి సుస్వాగతం!

సుగంధ పరిమళభరితంకాగా,
భారతం నవాభ్యుదయ వీచికకాగా,
ఈ నాడు మా నాడు క్రాంతి
యజ్ఞవాటిక కాగా,
ప్రతి ఉదయం ఎర్రని
మందారం విడిసి విప్పారాలనీ,
ప్రతి హృదయం ఆనందో
బ్రహ్మం కావాలనీ

సుమనస్సుల మల్లెమాలలతో
కొండంత ఆశల కదంబాలతో
చైత్రోత్సవ వసంతనృత్యం చేస్తూ
పలుకుతున్నాను స్వాగతం!
సమసమాజ వాంఛా భరిత సుస్వాగతం!!
వస్తోంది ఉగాది!
కొత్త వత్సరానికి పునాదిలా.
సరికొత్త ఉగాది! !
యుగారంభాన్ని సూచిస్తూ
కొత్త ఆరంభానికి
స్వాగతాలు పలుకుతూ,
వస్తూనే ఉంది ఉగాది
వచ్చి వెడుతూనే ఉంది ఉగాది!
ఈ పండుగకు ఎవరు వేశారో పునాది! !


మళ్లీ మళ్లీ మనిషిలో
కొత్త ఆశలు రేకెత్తించి
సరికొత్త కోర్కెలు పూయించి
నూతన జీవితానికి విందుగా
మనిషిని ముందుకు ఆశతో
ఆశయంతో సాగిపొమ్మని
ఉత్సాహాన్ని ఇస్తూ
వచ్చింది ఉగాది!
ఈ పరీధావిలో
అడుగడుగూ
శుభం పూచి శుభం పలికి
శాంతినీ, కాంతినీ, క్రాంతినీ
విశ్వ ప్రపంచ మానవాళికి అందించి
నూతన యుగోదయానికి
స్వాగతం పలకాలి!!

పరీధావి!
కష్టాలు లేని నష్టాలు లేని
బాధలూ బరువులూ
ఈర్ష్యలూ ద్వేషాలూ రోషాలూ
లేకుండా జరిగిపోవాలి!
ఉగాది!
అందంగా బ్రతుకు మందారంలా
జీవితం నిండిన మకరందంలా
గడిచిపోవాలి!
కొత్త సంవత్సరం రాకతో
బ్రతుకుల్లో కూనిరాగాలు పోయి
కోకిల గానాలతో
పూలబాలల సరికొత్త భావాల
సుగంధ పరిమళాలతో
పంచామృతాలు నిండిన జాబిలంతో
ఉయ్యాల దంబాలగా
హాయిగా ఆనందంగా
నందనంగా గోకులంగా నిండిపోవాలి!

ఈ కొత్త వత్సరం
మనిషిని మనిషిగా నిలిపి
మనసున క్రాంతి శంఖాలు వినిపించి
విశ్వవిజయ గీతాలతో
ఉగాదికి స్వాగతం పలకాలి!

పరీధావి—
మనుషుల్లో మనసుల్లో
మమతల పందిళ్లు అల్లి
మమకారాల మొగ్గలు తొడిగి
సమతాపుష్పాలను విడిసి
ఆనందగీతాలతో
మానవతా హృదయాలను
మనోహరం చేయాలి!

—ఎల్లోరా



చెట్టుకు కాయ బరువా? ఫోటో— వి. టి. కుమార్ (కల్యాణ్)

లేదు' అని ఎవ్వరికీ నమ్మకం కలిగించలేదు. అందరికీ ఏదో పాపం చేశామనే శంక. ఉన్నతమైన సమాజ విలువల్లోంచి దిగజారామనే బాధ. మళ్ళీ సమాజంలో ఇమిడి దానికి విధేయులుగా నడుచుకోవాలనే తపన.

ఒక్కరికీ సమాజాన్ని ధిక్కరించాలనే ఆలోచన లేదు. తన బిడ్డని తనతో తెచ్చి పెంచుకోగలిగే సాహసం లేదు. ఆ శక్తి ఇవ్వని సంస్కర్తలు రహస్యంగా ఒక్క క్షణం కన్నీళ్లు తుడిచి, జీవితమంతా ఆ బిడ్డ కోసం చెమ్మగిల్లే కళ్ళ నెలా ఓదార్చగలరు?

"నే నక్కడినించి వచ్చే ఆఖరినాడు నా చేతుల్లో బిడ్డని ఆయాకి ఇచ్చి ఆ ఇంటిమెట్లు దిగుతూన్న క్షణాల్లో, నా ఆలోచనల్లో, ఇంత ధైర్యం ఉంటే, చుట్టూ మనుషుల అభిప్రాయాలమీద ఇంత నిర్లక్ష్యం ఉంటే నే నసలు మా వాళ్ళ వెనక తల వంచుకొని ఇంటికొచ్చేదాన్ని కాదు. వచ్చినా వాణ్ణి నా ఒళ్లో పెట్టుకుని తెచ్చుకునేదాన్ని. వింటున్నావా, రఘూ? ను వ్వసలు మాట్లాడటం లేదేం?"

రఘునాథ్ చాలా ప్రయత్నంమీద మాట్లాడాడు.

"ఏం లేదు. వింటున్నాను, చెప్పు."

"నేను ఇంటికి వచ్చినా, వాణ్ణి మరిచిపోలేదు. చంటిపిల్లంమీద మమకారం ఎక్కువైంది. నా పెళ్లి పెద్ద సమస్య అవుతుందేమోనని నన్ను మళ్లీ చదువులో పెట్టారు. క్లాసులో కూర్చుని రాత్రుళ్ళు పుస్తకాలు ముందేసుకుని, మంచంమీద కళ్ళు మూసుకు పడుకుని —ఎప్పుడూ వాణ్ణే గురించి ఆలోచించేదాన్ని. ఇప్పుడు పెద్దవాడై ఉంటాడు. ఆ ముందు వరండామీద పాకుతూ ఉంటాడు. ఆ వీధి మెట్లమీద పడిపోతా డేమో! ఆయా వాణ్ణి చూసిందో లేదో! ఇప్పుడు తప్పటడుగులు వేసి నడుస్తున్నాడేమో! ఇప్పుడా వరండాలమీద గంతు లేస్తున్నాడేమో! ఇప్పుడా కాంపౌండంతా పరుగులెత్తుతున్నాడేమో!. . . ఇలాగే నా ఊహల్లో వాడు నెలలూ, సంవత్సరాలూ పెద్దవాడయ్యాడు. అప్పట్లో నాకు పెళ్ళంటే— సెక్సు సంబంధాలు జ్ఞాపకం వచ్చి భరించలేని ఏవగింపు కలిగేది. ఏ మగవాణ్ణి చూసినా అసహ్యంతో చాలా దూరంగా మసలాలనిపించేది. నా చదువు పూర్తిచేసుకుని, స్వేచ్ఛ సంపాదించుకుని ఆ పిల్లవాణ్ణి తెచ్చుకుని 'నా కొడుకే' అని అందరికీ ధైర్యంగా చెప్పి, వాణ్ణి ప్రేమతో పెంచుకుంటూ ఒంటరిగా బతకాలనిపించేది."

"అవును. తెచ్చుకోవలసింది" అన్నాడు రఘునాథ్. ఆ మాటల్లో ధ్వనించిన అశాంతి సుజాతకి అర్థం కాలేదు.

సుజాత అతన్ని ఆరాధనతో చూస్తూ—"కానీ, నీ కోసమే, రఘూ! నీ కోసమే నే నా ప్రయత్నం మానుకున్నాను. నీ స్నేహం అప్పట్లో నాకు మానసికంగా చాలా ఆరోగ్యాన్నిచ్చింది. నీకుకూడా దూరంగా ఉండాలని నే నెంత ప్రయత్నించినా, నా మనసు నీ చుట్టూ అల్లుకుని నిన్ను తలుచుకోగానే నా కేదో కొత్త అనుభూతి కలిగేది. నాకే అర్థం కానంత ఆశ్చర్యంగా నువ్వు నా మనసంతా ఆక్రమించుకుని, నా ఆలోచనల్లో భాగమై పోయావు. నువ్వే లేకపోతే నాకు జీవితమే వ్యర్థమనిపించింది. సెక్సు జీవితానికన్నా అతీతమైన ఏదో దివ్యానందం నాకు స్ఫురించి నీ కోసమే ఆరాటపడ్డాను. ఆ పిల్లవాణ్ణి తెచ్చుకోవాలనీ, ఒంటరిగా బతకాలనీ అనుకునే దంతా మార్చుకుని నీతో పెళ్లికి ఒప్పుకున్నాను."

రఘునాథ్ మాట్లాడలేకపోయాడు. ఆమె తనకిచ్చిన స్థానం ఎంత మహోన్నతమైనా, అతని మనసు కలత పడుతూంది. రాజారావే గుర్తొస్తున్నాడు అతనికి.

"రఘూ! నువ్వుగాక ఇంకెవరైనా తారసపడి ఉంటే నేను చాలా అపోహలతో కాలం గడుపుతూ ఉండే దాన్నేమో! నా కిప్పు డనిపిస్తుంది— ఇంత మనోహరంగా, ఇంత పరవశంగా అనుభవించవలసిన సెక్సు జీవితాన్ని ఎంత పతనం చేసుకుంటున్నారు మనుషులు! ఏ జ్ఞానమూ ఎరగని ఒక చిన్న పిల్లమీద దౌర్జన్యం చేసి క్షణికంగా ఆ నీచుడు అనుభవించిన ఆనందం ఏపాటిది? శృంగారానుభవంలో ఉన్నత విలువలు తెలిసిన వాళ్ళ జీవితంలో ఎన్నడూ ఏ నీచసంబంధాలకీ సిద్ధపడరు కదా?"

"అవును. . . తరవా తేమైంది?" అన్నాడు రఘునాథ్ అయిష్టమైన ఆసక్తితో.

సుజాత కొంచెం నవ్వి— "తరవాతేమైందా? మన పెళ్లయిన తరవాత నాకు నెల తప్పినందుకు మా వాళ్లంతా ఎంత ఆనందించారో, ఎన్ని వేడుకలు చేశారో, నన్నెంత ముద్దుగా చేశారో తెలుసా?"

మనుషులు సంఘం పేరు పెట్టుకుని తోటి మనుషులకే ఎంత నీచులై దాస్యం చేస్తారో బాగా అర్థమైంది సుజాతకి. సృష్టిలో ఏ జీవీ తన లాంటి ఇంకో జీవిని చూసి భయపడదు. మనిషి మాత్రం ఇంకో మనిషికి గజగజ వణుకుతాడు. ఇద్దరు మనుషుల మధ్య ఊహ కందని అగాధం. ఎవరి దుఃఖం వాళ్లదే. ఎవరి రహస్యం వాళ్లదే.

పెళ్లితో ఏమీ సంబంధం లేకుండా ఒక ఆడపిల్ల తల్లి కావటానికి చుట్టూ ఎన్ని అవకాశాలున్నాయో మనుషులందరికీ తెలుసు. అర్థం చేసుకునే విషయమే కానట్టు నటిస్తారు. ఎక్కడికో తీసుకుపోయి, ఒక మనిషి సంగతి ఇంకో మనిషికి తెలియకుండా దాచవలసిన అవసరం ఎందుకు కలగాలి? మనుషుల సమస్యలు మనుషులకే ఎందు కర్థం కావు? ఇన్ని కోట్ల జీవరాసుల్లో క్రిమికీటకాలకన్నా మనుషు లెంత అల్పులు! ఏముంది ఈ జీవితాల్లో? అంతా వంచన. ఆత్మవంచన. పరవంచన. అన్నీ సంకెళ్ళు. కనిపడని ఉరితాళ్ళు. కాళ్ళకీ, చేతులకీ, నోటికీ, మనసుకీ — తోటిమనుషులే వేసి బిగించే బంధాలు. సంఘ శాంతి అనే దొంగ పేరుతో వ్యక్తి జీవితాన్నంతా అశాంతితో నరకంచేసే సిద్ధాంతాలు. ఆలోచించరు. మార్చుకోరు. భరిస్తారు. ఏడుస్తారు. దుఃఖంలో, అబద్ధంలో, రహస్యంలో బతికేస్తారు.

"ఎవరికి వారే పవిత్రులైతే, సంఘం శాంతితో అలరారుతోంటే ఆ హోమ్‌నిండా అంతమంది పిల్లలెలా వచ్చారు, రఘూ! ఆ పిల్లలు. . ." సుజాత కంఠం కంపించింది.

ఆ హోమ్‌లో పిల్లలు మాత్రమేనా? రోడ్ల పక్కనో, చెట్లకిందనో, అనాథ శరణాలయాల గుమ్మాలలోనో కళ్ళు తెరిచే బిడ్డ లెంతమంది? పవిత్ర గృహాంతర్భాగాలలో రహస్యంగా శ్వాస పీల్చి తక్షణం శాశ్వతంగా శ్వాస వదిలే శిశువుల మాటేమిటి? ఏ శాంతికి, ఏ నీతికి నిదర్శనం ఈ పిల్లలు?

ఈ పిల్లలంతా పవిత్ర సంఘ మర్యాదకీ, నీతి సూత్రాలకీ ఆహుతైన పసికందులు! కామాంధుల రాక్షసత్వానికి ఫలితం అనుభవించే నిర్దోషులు! స్వేచ్ఛ

లేని తల్లుల మానసాకాశాల్లో నక్షత్రాల్లా మెరిసే అమాయకులు!

"అమ్మ అంటే ఏమిటని అడుగుతారు వాళ్ళ, రఘూ. నా కలల్లో, నా ఆలోచనల్లో ఎప్పుడూ... ఎప్పుడూ ఆ పిల్లలే."

అక్కడి పిల్లలంతా ఆయాల దయతో పెరిగి సమాజానికి వినయంగా తయారౌతారు. పవిత్రులు మిడిసిపడి వెక్కిరించినప్పుడు నిర్లక్ష్యం చెయ్యగల ఆత్మవిశ్వాసం లేకనీచులమనీ, అల్పులమనీ పరితపిస్తారు. వదిలేసి వెళ్ళి పతివ్రత అయిన తల్లి కోసం, పుట్టక ముందే పారిపోయి నీతిమంతుడైన తండ్రి కోసం, మర్యాదస్థులమని హేళన చేసే బంధువుల కోసం, తమ నా స్థితికి తెచ్చిన సమాజ విలువల కోసం జన్మంతా తపించేంత అజ్ఞానులౌతారు. బయట కుటుంబ సంబంధా లెంత హీనమో అన్ని వందల నిదర్శనాలు తెలిసికూడా విద్యలోగానీ, ఆలోచనల్లోగానీ ఏమీ చైతన్యం లేక అందరికన్నా తామే అవినీతిపరులమనే దుఃఖంలో పడతారు. ఆ చిన్ని హృదయాల న్యూనత పోగొట్టి గర్వంగా ప్రపంచంముందు నిలబెట్టే ప్రయత్నాలు లే వక్కడ.

"రఘూ! నిన్ను పెళ్ళి చేసుకుని, తల్లినయ్యే హక్కు సంపాదించి కన్నబిడ్డలతోపాటు ఆ దౌర్భాగ్యుణ్ణి కూడా నా మనసంతా నింపుకుని పెంచుతున్నాను. ఒక్కో క్షణంలో నా ఆవేశం నిగ్రహించుకునే శక్తి లేక— 'నాయనా! నేను నీ తల్లిని. నీ కోసం నా కళ్ళ చెమర్చని రోజు లేదు. నేను నిన్ను మరిచిపోలేదు' అని ఒక్కసారి వాడికి నమ్మకంగా చెప్పి వాణ్ణి నా చేతుల మధ్యకి తీసుకోగలిగితేగానీ నా జన్మకి సార్థకత లేదనేంత వెర్రి కలుగుతుంది."

సుజాత కళ్ళ వర్షిస్తున్నాయి. "రఘూ! నా బాధ పంచుకోవటానికి నువ్వున్నావనే నమ్మకం లేక ఇంత కాలం ఇదంతా భరించాను. ఎంత మూర్ఖత్వం చూడు! నా మనసులో మాట ఏ నాడో చెపితే నా కోరిక తీర్చేవాడివికాదా? రఘూ! ఇప్పుడు మనం వాణ్ణి తెచ్చుకోకూడదా?"

అదిరిపడ్డాడు రఘునాథ్. "నీ కేం మతి పోయిందా?" అన్నాడు కర్కశంగా. వెంటనే మహా ప్రయత్నంమీద సర్దుకుని, "అదెలా కుదురుతుంది, సుజా? ఇంతకాలం తరవాత ఆ పిల్లాడు నీ దగ్గి రెలా ఉంటాడు?" అన్నాడు శాంతంగానే.

"నా దగ్గిరే ఉండడా? అంత నమ్మకం నేను కలిగించుకోనా?" అని వెర్రిచూపు చూసిం దా తల్లి.

"కానీ మన పిల్లలు. . . ఇప్పుడు నువ్వు వాళ్ళకి మారమ్మైనట్టు. . . వాళ్ళెంత గాయపడతారో ఆలోచించాలి ముందు."

"ఎవరు గాయపడ్డా భరించలేను నేను. అలా జరగకుండా చెయ్యలేమా మనం?"

'కానీ, నలుగురూ ఏమనుకుంటారు?' అనబోయి నిగ్రహించుకున్నాడు. మళ్ళీ అదే బలహీనత. మనిషికి మనుషుల్ని చూస్తే భయం. ఇది ఎలా వదుల్చుకోవాలి?

భార్య సంగతి విని రాజారావు పడ్డ బాధ ఎంతో సహజం అనిపిస్తోం దిప్పుడు. అతని సమస్య అతని కెంత భయంకరంగా కనిపించిందో, ఇది తనకు అంతకన్నా భయంకరంగా ఉంది. రాజారావుకి తను చెప్పిన మాట లిప్పే మళ్ళ తిరుగుతున్నాయి మనసంతా.

జీవితం అంటే హాయిగా, సాఫీగా బతికెయ్యటం కాదన్నాడు తను. చాదస్తాలకు అతీతంగా ప్రవర్తించా లన్నాడు. సంఘభయంకన్నా నీచమైన బానిసత్వం లేదన్నాడు. అడుగడుగునా స్నేహాలతో, త్యాగాలతో ప్రేమని సాధించమన్నాడు. అన్నీ తను హృదయపూర్వకంగా నమ్మి చెప్పాడు. స్త్రీలమీద సానుభూతితో, గౌరవంతో చెప్పాడు. శ్యామలని తనైతే సునాయాసంగా క్షమిస్తా ననుకున్నాడు. కానీ, అంతకన్న పసి వయసులో దారుణమైన క్షోభ భరించిన సుజాతమీద తన కెంత జాలి కలుగుతున్నా జాలితో పరిష్కరించుకోగలిగే సమస్యా ఇది?

తన జీవితభాగం అనుకున్న తన భార్యకి పన్నెండేళ్ళ కొడుకు. అనుక్షణం వాడిమీదే మమకారం. వాడి గురించి ఊహలు. వాడిమీదే కలలు. వాడికోసమే ఆ కళ్ళలో ఆరని కన్నీళ్ళ. వాడిముందు మిగిలిన జీవితమంతా తృణప్రాయం. ఎంత దౌర్భాగ్యం! తన ప్రేమంతా ఎంత వ్యర్థం!

రఘునాథ్ మౌనంలో స్పష్టంగా కనిపిస్తున్న మార్పు సుజాతకి ఆందోళన కలిగించింది.

సంకోచిస్తూ — "బాధపడుతున్నావా, రఘూ?" అంది.

"లేదు. చాలా సంతోషిస్తున్నాను" అన్నాడు విరక్తిగా నవ్వి.

నిర్ఘాంతపోయింది సుజాత.

అప్పటికి అతని ధోరణి ఆమె కర్థమైంది.

"పెళ్ళికి ముందు మనం ఎంతో స్నేహంగా ఉన్నాం. ఈ విషయం నా దగ్గిర ఎందుకు దాచాలి?"



కాళీయమర్దనం
ఫోటో— వి. కృష్ణారావు (నెల్లూరు)

"నేను చెప్పింది నీ కేమీ అర్థం కాలేదా, రఘూ?"

"బాగానే అర్థమైంది— నన్ను నువ్వెంత గాఢంగా నమ్మావో, ఇంతకాలం నువ్వెంత ఆనందంగా కాపరం చేశావో!"

రఘు విషయంలో తన అంచనాలన్నీ తారుమారై, దిగ్భ్రమతో మాట్లాడలేకపోయింది సుజాత.

రఘు లేచి నించున్నాడు. 'దయచేసి ఆ పిల్లాడి సంగతి నా దగ్గ రెప్పుడూ ఎత్తకు. నేను భరించలేను' అందామనుకున్నాడు. ఏ అనురాగబలమో, ఏ సంస్కార జ్ఞానమో ఆపింది అతణ్ణి.

"తలనొప్పితో చాలా బాధగా ఉంది, సుజా! నేను వెళ్ళి పడుకుంటాను" అని గబగబా వెళ్ళిపోయాడు.

స్థాణువై కూర్చుంది సుజాత. ఆమె మనసంతా ఉప్పెనలాగ ఆవేశం పొంగింది. 'మనుషులంతా ఇంతేనా? రఘుకూడా. . .?' అనుకుంది. ఎంత నగ్నసత్యం! తను ఆ బిడ్డని వదిలివచ్చిననాడే ఆ దౌర్భాగ్యపు తల్లి చచ్చిపోయింది. ఇక ఆ బిడ్డ కోసం కాదు తను ఏడ్చేది. ఇంతకాలం తరవాత తన విశ్వాసాలన్నీ చెల్లాచెదరై, తన రఘు రాజారావు అంత సామాన్యుడా?— 'రఘూ! ఎప్పట్లాగే మనం పరువు ప్రతిష్ఠలతో గొప్పవాళ్ళమై బతుకుదాం. నీ కీర్తికీ, హోదాకీ భంగం రానివ్వను. నీ కోసమైనా నే నీ అశాంతి భరిస్తాను' అని చెప్పి అతనికైనా ఆనందం కలిగించాలనుకుంది.

ఆమె చెంపలనిండా కన్నీళ్ళ.

నిస్సహాయత్వంతో, విరక్తితో ఘనీభవించిన శిలా ప్రతిమలా అచేతనంగా కూర్చుని ఉంది.

• • •

రాజారావూ, శ్యామలా మర్నాడుకూడా డాక్టర్ రఘునాథ్ దగ్గిరకి వచ్చారు.

రఘునాథ్ మిగతా పేషెంట్లతో తొందరగా ముగించుకుని ఆ ఇద్దర్నీ లోపలికి పిలిచాడు. ఇద్దరూ చాలా వింతగా కనిపించారు. రాజారావు ఎప్పట్లాగే నవ్వుతూ ఉన్నాడు. శ్యామల ఏమీ భయపడనట్టు నిశ్చింతగా, ప్రశాంతంగా ఉంది. రఘునాథ్ నమ్మలేనట్టు ఇద్దర్నీ మార్చి మార్చి చూశాడు.

ఇద్దరూ సోఫాలో చాలా దగ్గరగా కూర్చున్నారు. రఘునాథ్ ఆత్రతగా చూస్తూ—"ఏమిటి, రాజారావ్? ఏం నిర్ణయించుకున్నారు?" అన్నాడు.

రాజారావు క్రిందటిరోజు తన మాటలకూ, కోపానికీ సిగ్గుపడ్డవాడిలా నవ్వుతూ— "నిర్ణయించుకోవటాని కేముంది, డాక్టర్? ఈమె ఆరోగ్యం బాగుండేలాగ మందులేమైనా రాసి ఇవ్వండి" అన్నాడు.

డాక్టర్ తెల్లబోయి— "ఆరోగ్యం బాగుండేలాగా? అంటే? అబార్షన్ చేయించే ఉద్దేశ్యం లేదా?"

రాజారావు తల అడ్డంగా తిప్పుతూ—"ఎందుకు? ఎందు కా పని చెయ్యాలి?" అన్నాడు.

"ఎందుకేమిటి?" రఘునాథ్ ఆశ్చర్యపడుతూ, "ఆ బిడ్డకి నువ్వు తండ్రివని చెప్పుకుంటావా?" అన్నాడు.

"ఎవరికి చెప్పుకోవాలి? ఏ బిడ్డకి ఎవరు తండ్రులో అందరూ మనకి విన్నవించుకుంటున్నారా, డాక్టర్! మే మిద్దరం నిన్న మీ దగ్గిరకి రాకుండా ఇంకో డాక్టర్ దగ్గిరకి వెళ్ళి ఉంటే ఈసరికి మా పరిస్థితి ఇంకో రకంగా ఉండేది. మీరు నాకు జ్ఞానభిక్ష అంటారే

అలాంటి భిక్ష పెట్టారు. మీ మాటలతో నేను చాలా కదిలి, నన్ను నేను ప్రశ్నించుకుని కొంచెమైనా ఆలోచించటం నేర్చుకున్నాను.

నా ప్రేమకి పరీక్ష అనుకోమన్నారు మీరు. 'ప్రేమ' అనే మాట నాకు చాలా ఎబ్బెట్టుగా వినపడుతుంది. సినిమాల్లోలాగ, నవలల్లోలాగ నేను 'ప్రేమించి' పెళ్లి చేసుకోలేదు. అది ప్రేమో, కాదో నాకు తెలియదు కానీ, ఈమె నా జీవితంలోకి వస్తుందనుకున్న క్షణం నించీ నాకే అర్థంకాని సంతోషం ఏదో అనుభవించాను. పన్నెండు రోజులకేనా అని మీరు నన్ను హాస్యం చేశారు. పన్నెండు సంవత్సరాలు కలిసి జీవించిన వాళ్లయినా ఇలాంటి పరిస్థితి వస్తే నా కన్నా ఎక్కువ న్యాయంగా ప్రవర్తిస్తారనుకోను. మా ఇద్దరి మధ్యా జీవితం ఇంత కొత్తలోనే, నేను తన కోసం ఏమైనా చెయ్యగలనో లేదో అన్న ఋజువుతో ప్రారంభమైందంటే నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ సంగతి వింటే మీరుకూడా చాలా సంతోషపడతా రనుకున్నాను."

డాక్టర్ మొహం పరిశీలిస్తూ ఆగాడు రాజారావు.

రఘునాథ్ తన ఆశ్చర్యాన్ని వెల్లడి కానివ్వకుండా—

"ఎందుకు సంతోషపడనోయ్? చాలా సంతోషం నాక్కూడా. అసలు మీ అభిప్రాయం నా కర్థం కాలేదుకదా? నీ రక్తసంబంధంలేని బిడ్డని నువ్వు నిజంగా ప్రేమించగలవో, లేదో బాగా ఆలోచించుకున్నావా? ఇప్పు డేదో ఉన్నతంగా ప్రవర్తించాలని అనేసుకుని ఆ బిడ్డకి జన్మ ఇస్తే తరవాత జీవితమంతా. . ." అని హెచ్చరించబోయాడు.

"మీరు నన్ను శంకిస్తారని నాకు తెలుసు. కాని, నే నేదో ఉన్నతంగా ప్రవర్తించాలని ఇలా నిర్ణయించుకోలేదు. ఆలోచిస్తే నా కిది చాలా సహజంగా కనిపిస్తోంది. నా రక్తసంబంధం కాదు కాబట్టి ఇప్పుడు శ్యామల కడుపులో పెరుగుతోన్న బిడ్డని చంపించి, రేపు మళ్లీ నా రక్తంతో ఏర్పడ్డాక దాన్ని రక్షించుకోనే ప్రయత్నాలన్నీ నేనే చెయ్యాలి. ఎంత వింత, డాక్టర్! అలా జరిగినతరవాత నాకు నేనే ఎంతో వికృతంగా కనపడతాను. మీ రన్నారుకదా! ఈ తండ్రులంతా ఎంత నిజం తండ్రులు? కాకపోతే మాత్రం మానవజాతి కొచ్చిన లోపం ఏమిటి? మన తల్లులంతా పెళ్లిళ్ళు చేసుకున్నాక మనల్ని కని,సంఘం దృష్టిలో మర్యాదస్తుల్ని చేశారు. మనమే ఏ పెళ్లికాని తల్లికైనా పుట్టిఉంటే సంఘానికి వెలిపడ్డ వాళ్లం కావలసిందేకదా? ఇంత ఆలోచించగలిగి మన జీవితాల్లో మనం నమ్మే విధంగా ఏమీ చెయ్యలేమా?"

"ఆలోచించినంత తేలిక అనుకుంటున్నావా ఆచరించటం? నేను సంఘం దృష్టితో అడగటం లేదు. ఆ బిడ్డకు తండ్రి నువ్వు కాదనుకుంటే నీకు మానసికంగా క్షోభ కలగదా?"

రాజారావు నవ్వి— "మీరు నన్ను పరీక్ష చెయ్యడానికి ఇన్ని ప్రశ్నలు వేస్తున్నారు. మీకు తెలియందేముంది, డాక్టర్? మనుషులేనా తండ్రులయ్యేది? తండ్రి కావటమే గౌరవం అయితే, మనం దున్నపోతుల్నీ, ఆంబోతుల్నీ, పక్కుల్నీ, కుక్కల్నీ— గర్భం ఇవ్వగల ప్రతి మగజీవినీ గౌరవించాలి కదా? నా తండ్రి తాగుబోతై నన్ను వదిలేస్తే, మా మేనమామ తన బిడ్డల్లో ఒక బిడ్డలాగ నన్ను పెంచాడు. రక్తసంబంధంతో తండ్రినయ్యేకన్నా ప్రేమతో, వాత్సల్యంతో



నలుపు తెలుపు
చిత్రం— డబ్ల్యు. జె. నవీన్ కుమార్ సైభాప్
(సికిందరాబాదు)

ఆ బిడ్డ మనసులో తండ్రి స్థానం సంపాదించటం ఉన్నతం కదా?— భార్యల శీలానికి కొత్త అర్థాలు చెప్పుకోవాలన్నారు మీరు. అలాగే తండ్రుల సంబంధానికి కూడా కొత్త అర్థాలు చెప్పుకోవచ్చు కదా?"

డాక్టర్ తన దిగ్భ్రాంతిని అణచుకుంటూ శ్యామల వేపు చూసి— "మీకుకూడా ఎబార్షన్ ఇష్టంలేదా?" అన్నాడు.

రాజారావు కలగజేసుకుని — "నేను బాధపడతాననే సంకోచమో, నలుగురూ వెక్కిరిస్తారనే భయమో లేకపోతే ఏ తల్లికయినా బిడ్డని చంపుకోవటం ఎందు కిష్టమవుతుంది? శ్యామల ఇష్టమేనని చెప్పినా నమ్మటానికి వీల్లేదు, డాక్టర్!" అన్నాడు.

శ్యామల ప్రశాంతంగా చూస్తూ—"బావ నన్ను మోసం చేశాడని అర్థమైనాక అతనిమీద అసహ్యంతో. . . ఇదంతా వదుల్చుకోవాలని ప్రతి క్షణం ఆరాటపడ్డాను, డాక్టర్‌గారూ! కానీ. . . ఈయన . . . ఈయనమీద నా కిప్పుడే సందేహం లేదు. ఈయన మన సెంతో గొప్పది. ఈ బిడ్డ పుట్టినా మే మిద్దరం సంతోషంగానే పెంచగలం. ఈ బిడ్డకి ఈయన కాకపోతే ఇంకెవరు తండ్రవుతారు?" అంది.

రఘునాథ్ నిశ్చేష్టుడై పట్టు కూర్చున్నాడు. కొంత సేపటికి తేరుకుని— "నిజమే, రాజారావ్! మీ ఆలోచనంతా మంచిదే. మిమ్మల్ని నా కన్నా అర్థం చేసుకునే వాళ్లు ఉండరు. కాని, పది మంది మధ్యా ఉన్నాం. బంధువులు, స్నేహితులు, ఇంకా ఎందరో తెలిసినవాళ్లు, తెలియనివాళ్లు... వాళ్లంతా మీ గురించి వింతగా మాట్లాడుకుంటారని తెలిస్తే?"

"మాట్లాడుకోనివ్వండి. వాటి లెక్క మా కేముంది? బంధువులకన్నా, స్నేహితులకన్నా శ్యామల నాకు దగ్గర వ్యక్తి అయింది. నా జీవితంలో ప్రత్యేకభాగం అయింది. ఆమె మనసుకో, ఆరోగ్యానికో హాని కలిగే పని నే నెట్లా చేస్తాను?"

రాజారావుమీద రఘునాథ్‌కి చాలా గౌరవం కలిగింది. పెన్ను తీసి ప్రిస్క్రిప్షన్ రాశాడు—

అది రాజారావు కిస్తూ— "ఇవి రెగ్యులర్‌గా వాడటం మంచిది. రే పొసారి వస్తే బి. పి., యూరిన్ టెస్టు లవీ చూడాలి. ప్రతి నెలా చెకప్ చేయించుకోవాలి. పాలూ, పళ్లూ, ఆకుకూరలూ ఎక్కువగా వాడాలి. రోజూ సాయంత్రంవేళప్పుడు కొంత దూరం నడవటం మంచిది. తరవాత మళ్లీ చూసి ఏమైనా అవసరమైతే చెపుతాను."

"థాంక్స్, డాక్టర్!" అంటూ రాజారావు ఆ చీటీ అందుకుని డాక్టర్‌కి నమస్కారం చేశాడు.

శ్యామలకూడా లేచి నిలబడి వినయంగా, భక్తిగా చేతులు జోడించింది చిరునవ్వుతో—

శ్యామల వచ్చేవరకూ రాజారావు నిలబడి ఆమె చెయ్యి అందుకున్నాడు. ఇద్దరూ నెమ్మదిగా నడిచారు. మెట్లు దగ్గిర ఆమె జాగ్రత్తగా దిగడానికి సాయం చేశా డతను. ఆ చెయ్యి విడవకుండా ఆసరాగా పట్టుకున్నా డతను. ఇద్దరూ ఒక్కటిగా నడుస్తున్నారు.

కిటికీలోంచి ఆ దృశ్యం చూస్తూన్న రఘునాథ్ చలించిపోయాడు.

ఆమె సమస్త దుఃఖాన్నీ మరిపించిన అభయహస్తం అది! యుగయుగాల చైతన్యరహిత సంఘ ధిక్కారం అది! కామానికీ, ఆకర్షణకీ అతీతమైన అంతరాత్మల స్నేహం అది! మానవ బలహీనత లెన్నో కాలదన్నిన మహోన్నతాదర్శం అది! ద్వేషాలూ, కార్పణ్యాలూ జయించిన అంతరంగాల ఐక్యం అది!

ఒక్క క్షణం. . . ఆ ఔన్నత్యంలో ఒక్క క్షణం... జీవితమంతా ఎంత ధన్యం!

రఘునాథ్ కుర్చీలో కూర్చుని పెన్ను తీశాడు.

"నా ప్రియమైన సుజా!

క్షమిస్తావా నన్ను? నా అహంకారం పటాపంచలై, నేను ఎంత అల్పుణ్నో నాకే స్పష్టమై నీ క్షమ కోసం నేను ప్రార్థిస్తున్నాను.

మన బిడ్డని మనం తెచ్చుకుందాం. ఆ చిన్ని హృదయంలో తలిదండ్రులుగా మనం చోటు చేసుకుందాం. ఆ పవిత్ర స్థానంతో మన జన్మలు పావనం చేసుకుందాం.

నాలో సంఘర్షణకీ, పోరాటానికీ ఒక రూపం వచ్చింది. ఇది నాకే సిగ్గు కలిగించేంత ఆలస్యంగా వచ్చింది.

వాళ్ల అన్న వస్తాడని వాడి తమ్ముడికీ, చెల్లెలికీ చెప్పు. మనం అందరం వాణ్ని ఆహ్వానించటానికి ఈవేళే బయల్దేరదాం. నీ కళ్లలో ఎప్పుడూ శాంతి కోసం, చిరునవ్వు కోసం పరితపించే—

ఎప్పటికీ నీ—
—రఘు." ★